

● గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు నీటి సరఫరా

నాగార్జున సాగర్ జలాశయంలోని నీటి వినియోగంపై నియంత్రణ కొరవడింది. ఇరు రాష్ట్రాలు ఇష్టారాజ్యంగా నీటిని వినియోగించుకుంటున్నాయి. 95 రోజుల్లో 122 టీఎంసీల నీటిని వాడేశారు. సాగర్ నీటి మట్టం 538 అడుగులకు పడిపోయింది. నవంబరు 12న పూర్తి స్థాయిలో నీటి మట్టం ఉండగా రోజురోజుకూ పడిపోతోంది. నీటిని పొదుపుగా వాడటంలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి రోజూ సాగర్ నుంచి 20,998 కూసెక్కుల నీటిని వాడేస్తున్నారు. కుడి కాలువకు 10 వేల కూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇదే స్థాయిలో తెలంగాణ కూడా నీటిని వినియోగించుకుంటున్నది. ఇరు రాష్ట్రాలు పోటీ పడి సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తుండటం తో వేసవిలో పరిస్థితి ప్రమాదకరంలో పడవచ్చనే అభిప్రాయాన్ని జలవనరుల నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

నీటి విడుదలపై.. నియంత్రణ ఏదీ?

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సాగు దాదాపు పూర్తయింది. ఖరీఫ్‌కు సంబంధించి మిరప సాగు మాత్రమే ఉంది. మిరపకు మార్చి ఆఖరు వరకు నీటి సరఫరా అవసరం ఉందని అంచనా. పల్నాడు జిల్లాలో రబీలో వరి సాగు కూడా పెద్ద ఎత్తున చేశారు. ఈ రెండు పంటలకు నీటి అవసరం ప్రధానంగా మార్చి చివర వరకు ఉంది. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో రబీలో వేసిన మొక్కజొన్న, పొగాకు వంటి ఇతర పంటలు చివరి దశకు వచ్చాయి. వాటికి నీటి అవసరం లేదు. ఈ నేపథ్యంలో సాగర్‌లో ఉన్న నీటిని పొదుపుగా వాడాల్సిన అవసరం ఉండగా ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న వాదన రైతుల నుంచి కూడా వ్యక్తమవుతోంది. కుడి కాలువ పరిధిలో అన్ని మేజర్లు, మైనర్ల పరిధిలో సాగునీరు అవసరం లేదు. పంటలు ఉన్న ప్రాంతాన్ని గుర్తించి ఆ పరిధిలోనే నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఖరీఫ్‌లో అన్ని పంటలు వేసినప్పుడు ఎలా అయితే నీరు వదులుతారో, అదే విధంగా దాదాపు అన్ని కాలువలకు నీటి సరఫరా జరుగుతోంది. వరి నాట్లు కూడా పూర్తయ్యాయి. మిరపకు ఆరు తడులు సరిపోతాయి. వరికి కూడా వార బందీ అమలు చేసినా సాగునీరు సరిపోతుందనేది అంచనా. పంటలు సాగు చేసిన ప్రాంతాలకు మాత్రమే సాగు నీరు సరఫరా చేసే విధంగా జలవనరుల శాఖ ప్రణాళికను రూపొందించాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో పంటలు లేకున్నా సాగునీరు పొల్లాల్లో వృధాగా ప్రవహిస్తోంది. అలాగే వాగుల్లో కూడా నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తున్నది. అవసరం ఉన్న కాలువలకు మాత్రమే నీటిని సరఫరా చేసేందుకు చర్యలు లేవు. కొన్ని కాలువలకు నీటి సరఫరాను నిలిపివేసేందుకు షట్టర్లు లేవని చెబుతున్నారు.

- అవసరం లేని కాలువలకూ నీటి విడుదల
- వాగుల్లో పారుతున్న కృష్ణా జలాలు
- కుడి కాలువకు 10వేల క్యూసెక్కుల నీటి సరఫరా
- 538 అడుగులకు పడిపోయిన సాగర్ నీటి మట్టం

దీని వలన అవసరం లేని ప్రాంతాలకు కూడా నీటి సరఫరా జరుగుతోంది.

అధికారులు దృష్టి సారించాలి

ఏ కాలువ పరిధిలో ఏ ఏ పంటలు సాగులో ఉన్నాయి. ఏ మేరకు నీటి సరఫరా అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేయాల్సి ఉంది. పంటలు లేని ప్రాంతంలోని కాలువకు నీటి సరఫరా నిలిపివేయాల్సి ఉంది. వార బందీ అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాలి. మిరప.. వరి సాగు ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలకు నీటిని సరఫరా చేయడం వలన నీటి వృధాను అరికట్టే అవకాశం ఉంది. ఈ మేరకు జలవన రుల శాఖ అధికారులు స్పందిస్తేనే వేసవి కూడా సాగర్‌లో నీటి నిల్వ ఉంటుంది. లేకుంటే తాగు నీటికి గడ్డు పరిస్థితులు నెలకొనే ప్రమాదం పొంచి ఉంది.

సాగర్‌లో నీటి నిల్వ ఇలా..

నాగార్జున సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు. సోమవారం 538.1 అడుగులు నమోదైంది. పూర్తి స్థాయి నీటి సామర్థం 312.05 టీఎంసీలు కాగా 184.39 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాగర్‌లోకి నీటి ప్రవాహం లేదు. జలాశయం నుంచి 20,998 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాలువకు 10,000 కూసెక్కులు.. ఎడమ కాలువకు 8,718 కూసెక్కులు.. ఎస్ఎల్‌బీసీకి 2,000 కూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. పంటల అవసరాలను గుర్తించి నీటి సరఫరా చేయకుంటే, సాగర్‌లో ఉన్న నీటి నిల్వ నిండుకోవడం ఖాయం. ఉన్న నీటి నిల్వ 512 అడుగులకు తగ్గితే 136 టీఎంసీల నీటి నిల్వ ఉంటుంది. అంటే ఈ స్థాయికి నీటి మట్టం చేరే వరకు ఇంకా 45 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంది. ఇప్పటికైనా నీటి సరఫరాపై జలవనరుల శాఖ అధికా రులు అప్రమత్తం కాకుంటే వేసవిలో తాగు నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. దీనిని ఇప్పటికైనా అధికారులు గుర్తించి మేల్కోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

నాగార్జున సాగర్ జలాశయంలో పడిపోయిన నీటి నిల్వ



వైసీపీ ప్రభుత్వం సృష్టించిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఇప్పటికీ గందరగోళంలోనే కొనసాగుతూనే ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నెలకొన్న గందరగోళాన్ని సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టినప్పటికీ, అది ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోంది.



సచివాలయం.. గందరగోళం!

- హేతుబద్ధీకరణపై ప్రభుత్వం మల్లగుల్లాలు
- మాతృ సంస్థల్లో విలీనం చేయాలని డిమాండ్
- మల్టీ పర్పస్ ఫంక్షనరీస్ పేరుతో పని భారం
- స్పష్టమైన జాబ్ చార్ట్ విడుదల చేయాలని డిమాండ్
- మంత్రి డోలాకు విన్నవించిన సచివాలయ ఉద్యోగులు

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను సృష్టించింది. పరిపాలనను ప్రజలకు చేరువ చేయడం అన్న పేరుతో రూపొందించిన ఈ వ్యవస్థ నిర్వహణ, పనివిధానానికి సంబంధించి విధివిధానాలు రూపొందించకుండా మొత్తంగా వ్యవస్థను గందరగోళం చేసింది. 2019లో కేవలం రెండు నెలల వ్యవధిలో లక్షా 30వేల మంది ఉద్యోగులను రిక్రూట్ చేసుకుని వారందరినీ గందరగోళంలో పడవేసింది. ఐదేళ్లపాటు వారిని పలు రకాల సేవల్లో వినియోగించుకున్న గత ప్రభుత్వం వారికి నిర్దిష్టమైన జాబ్ చార్టును కూడా రూపొందించకుండా నిర్లక్ష్యం చేసింది. ఉద్యోగులతో సంబంధం లేని పనుల్లో కూడా వాడుకుంటూ వారితో వెట్టి చాకిరీ చేయించుకుంది. గ్రామ పంచాయతీలకు సమాంతర వ్యవస్థలా సచివాలయాలను నడిపి పంచాయతీరాజ్ వ్యవస్థను నీరుగార్చింది. కనీసం వారికి డీడీవో అధికారాలు కూడా ఇవ్వకుండా చాకిరీ చేయించుకుంది. గతంలో సచివాలయ ఉద్యోగులకు సర్వీస్ అంశాలు మాతృశాఖ నుంచి జీతం మరొక శాఖ నుంచి పర్యవేక్షణ చేసిన పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన ఈ గందరగోళాన్ని తొలగించి, ఉద్యోగులను హేతబద్ధీకరించడానికి ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వం సవాళ్లను ఎదుర్కొంటోంది.



మిగులు ఉద్యోగులను ఏం చేయాలి?

గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 568 సచివాలయాలు ఉండగా 4,780 మంది ఉద్యోగులు, పల్నాడు జిల్లాలో 537 సచివాలయాల్లో 4,494 మంది, బాపట్ల జిల్లాలో 477 సచివాలయాల్లో 4,240 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తంగా మూడు జిల్లాల్లో 1,582 సచి వాలయాల్లో 13,514 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణ వల్ల ఒక్కో సచివాలయానికి సగటున ఏడుగురు ఉద్యోగులు సరిపోతారు. దీంతో జిల్లాలోని మొత్తం సచివాలయాల్లో 11,074 మంది ఉద్యోగులు సరిపోతారు. ఇంకా 2,440 మంది ఉద్యో గులు మిగులుతారు. ఇలా మిగిలిన ఉద్యోగులను ఏం చేస్తారనేది ఉద్యోగులను వెంటాడుతున్న ఆందోళన.

మాతృ శాఖకు పంపాలంటూ వేడుకోళ్లు

రాష్ట్ర సచివాలయంలో గ్రామ, వార్డు సచివాలయాల శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో సచివాలయ ఉద్యోగులు తమ గోడును ఏకరువు పెట్టారు. సచివాలయ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పించాలని విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణలో చెబుతున్న మల్టీ పర్పస్ ఉద్యోగుల విధానాన్ని తొలగిం చాలని ఉద్యో గులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ విధానంలో సొంత శాఖ విధులతో పాటు ఇతర శాఖల విధుల భారం కూడా ఉద్యోగులపై పడుతుందని ఉద్యోగులు వాపోతున్నారు. సచివాలయ ఉద్యోగులపై సచివాలయం పర్యవేక్షణ మాత్రమే ఉండాలని, మాతృశాఖ, సచివాలయం రెండింటి పర్యవేక్షణ ఉంటే అది గతంలో మాదిరిగా గందరగోళానికి దారి తీస్తుందని అంటున్నారు. సచివాలయ ఉద్యోగులకు నిర్దిష్టమైన జాబ్ చార్టును రూపొందించి అమలు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం పంచాయతీరాజ్ వ్యవస్థలో ఆరు గ్రేడులుగా ఉన్న పంచాయతీ కార్యదర్శులను 3 గ్రేడులకు కుదించాలని గ్రేడ్- 1,2 జోనల్ పోస్టులను గ్రేడ్- 1గా, గ్రేడ్- 3,4,5లను గ్రేడ్- 2గా, గ్రేడ్-6ను గ్రేడ్-3గా మార్చాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. సచివాలయం, పంచాయతీ డీడీవో, కన్వీనర్ బాధ్యతలు నిర్వహించే ఉద్యోగులకు హోదాకు తగినట్లుగా సీనియర్ అసిస్టెంట్ పే స్కేలు ఇవ్వాలని కోరారు.

హేతుబద్ధీకరణకు సంబంధించి గత నెల రోజులుగా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అది ఇప్పటి వరకూ ఒక కొలిక్కి రాలేదు. ఉద్యోగుల హేతబద్ధమైన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని, శాస్త్రీయమైన పరిష్కారం కనుగొనలేకపోతే సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉంది.

ముంచుకొచ్చిన... మృత్యువు

వారంతా రెక్కాడితేగానీ.. డొక్కాడని మహిళా కూలీలు. పొద్దునే లేచి, చద్ది కూడు తిని పొలం పనులకు పోయి పొట్ట నింపుకునే వారు. రోజూలాగే ఆ రోజూ చకచకా ఇంటి పనులు ముగించుకొని పొలం పనులకు పయనమయ్యారు. కానీ వారికి తెలియదు వారెళుతుంది తిరిగిరాని లోకానికని. కూలీలందరూ ఓ ఆటోలో కిక్కిరిసి కూర్చున్నారు. వారికి తెలుసు అలా వెళ్లడం ప్రమాదకరమని, ఏదైనా జరిగితే భారీ మూల్యం చెల్లించాల్సిం దేనని.. పది రూపాయలు మిగులుతాయని ప్రమాదంపైనే ప్రయాణమయ్యారు. ఉదయాన్నే రోడ్డును పొగ మంచు కమ్మేసింది. 'ఇదిగో అబ్బాయ్ జాగ్రత్తగా నడుపూ..' అని అంటూనే ఉన్నారు. ఈలోపే దట్టమైన మంచును చీల్చుకొచ్చిన ఓ బస్సు వారి ఆటోను ఢీ కొట్టింది. ముగ్గురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు..

- ఆటోను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు
- ముగ్గురు మహిళా కూలీల మృతి
- ఎనిమిది మందికి గాయాలు
- క్షతగాత్రులును గుంటూరు జీజీహెచ్‌కి తరలింపు





ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు



మృతులు అల్లంశెట్టి అరుణ,తోట సీతారాములు, కుర్రా నాంచారమ్మ

సమన్వయంతో పని చేయాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆర్వో నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు సమ న్వయంతో విధులు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో ప్రిసై డింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, జిల్లా రెవె న్యూ అధికారి ఖాజావలితో కలిసి ఆమె పాల్గొన్నారు. ప్రిసై డింగ్ అధికారులు ఎన్నికలు జరిగే ముందురోజు డిస్ట్రిబ్యూష న్ సెంటరు నుంచి పూర్తి స్థాయిలో పోలింగ్ సామగ్రి తీసుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటింగ్‌కు సంబంధించిన పూర్తి ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ రోజు ఉదయం 8 గంటల సమయానికి ఓటింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సమయంలో జరుగుతున్న అన్ని విషయాలపై నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం స్పందిస్తూ పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ప్రిసైడింగ్ అధికారి డైరీతో పాటు, ఇతర నాన్ స్టాట్యూటరీ, స్టాట్యూటరీ ఫారంలను సక్రమంగా పూర్తి చేసుకొని, బ్యాలెట్ బాక్స్‌లు సక్రమంగా సీజ్ చేసి రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించాలన్నారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్నప్పటి నుంచి తిరిగి వాటిని రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించే వరకు ప్రిసైడింగ్ అధికారులు అలసత్వం, నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులను ఫిబ్రవరి 20వ తేదీ నాటికి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అందేలా పోస్ట్ ద్వారా గానీ, స్వయంగా గానీ అందించాలన్నారు. దరఖాస్తులు అం దించిన వారి చిరునామాకు పోస్టల్ బ్యాలెట్ మెటీరియల్ పోస్ట్ ద్వారా అందించటం జరుగుతుందని, ఓటు నమోదు చేసి పోస్టల్ బ్యాలెట్ కవర్లు మార్చి 2వ తేదీ నాటికి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరే విధంగా పోస్ట్ చేయాలన్నారు.

సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ పోలింగ్ పూర్తి అయిన తరువాత బ్యాలెట్ పేపర్ వినియోగానికి సంబంధించిన ఫారాలు, ఇతర ఫారాలు పూర్తి స్థాయిలో పోలింగ్ కేంద్రాల్లోనే పూర్తి చేసిన తరువాత మాత్రమే రిసెప్షన్ కేంద్రాలకు బయలుదేరి రావాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు నిర్దేశించిన విధంగా పోలింగ్ కేంద్రాలలో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ ప్రిసైడింగ్ అధికారికి అవసరమైన సహకారం అందించాలన్నారు. సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులకు, మైక్రో అబ్జర్వర్లు నిర్వర్తించాల్సిన విధులు, బ్యాలెట్ బాక్సులు ఓటింగ్‌కు సిద్ధం చేసే విధానం, సీల్ వేసే విధానం పై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వీడియో చిత్రాల ద్వారా శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లుగా విధులు కేటాయించిన అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ

గురజాలలో.. వైసీపీకి షాక్!

- టీడీపీలో చేరిన వైసీపీ చైర్మన్, కౌన్సిలర్లు
- వైస్ చైర్మన్‌గా భారతి ఎన్నిక

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పరిధిలోని పిడుగురాళ్లలో వైసీపీకి ఆ పార్టీ కౌన్సిలర్లు భారీ షాక్ ఇచ్చారు. సోమవారం 17 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక ఈ నెల 3, 4 తేదీలలో వాయిదా పడటం, తిరిగి ఈ నెల 17వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సంసిద్ధమవుతున్న తరుణంలో ఊహించని విధంగా వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీతో తెగతెంపులు చేసుకొని (మిగతా 8వ పేజీలో)



ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు



ఇంటింటా సౌర వెలుగులు..!
● పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాఫ్‌ల ఏర్పాటు
● గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి సౌర కాంతులు
● లబ్ధిదారులను గుర్తించే పనిలో యంత్రాంగం
8

తిరుణాళ్ళను విజయవంతం చేద్దాం
● కోటప్పకొండలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు పుల్లారావు, అరవిందబాబు
8

చికెన్ @ 100
కొనుగోళ్లపై బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్

ముంచుకొచ్చిన మృత్యువు




ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో, మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బుడంపాడు ప్రమాదంపై పెమ్మసాని విచారం

● మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకుంటామని భరోసా..

● క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు

● అధికారిక చర్యల నిమిత్తం కలెక్టర్‌కు సూచనలు

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నారాకోడూరు రహదారిపై బుడంపాడు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురు మహిళా కూలీలు మృతి చెందడం పట్ల గ్రామీణాభివృద్ధిశాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విచారం వ్యక్తం చేశారు. భోపాల్ పర్యటనలో ఉన్న ఆయన దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే స్పందించిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సలు అందజేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వీ రమణను ఫోన్‌లో ఆదేశించారు. మృతి చెందిన ముగ్గురు వ్యవసాయ కూలీల కుటుంబాలతో పాటుగా క్షతగాత్రులను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఆ దిశగా తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మికి సూచించారు. అలాగే ప్రమాదం జరగడానికి గల కారణాలను పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మృతులు అరుణ, సీతారాములు, నాంచారమ్మలకు తన సంతాపం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గురైన ఆటోలో పది మంది ప్రయాణిస్తున్నారని తెలుసుకొని విస్మయం వ్యక్తం చేశారు. పరిమితికి మించి ప్రజలను తీసుకెళ్తున్న ఆటోలు, ఇతర వాహనాలపై చర్యలు తీసుకోకుండా రవాణా శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని అధికారులకు మంత్రి పెమ్మసాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



ప్రమాదంలో మృతి చెందిన కూలీల మృతదేహాలు

పొన్నూరుటౌన్(చేబ్రోలు) ఫిబ్రవరి 17: చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ సమీపంలో జీబీసీ రహదారిపై గుంటూరు వెళుతున్న మహిళ కూలీల ఆటోను గుంటూరు వైపు నుంచి నారాకోడూరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళ కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ ప్రమాద ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన మహిళ వ్యవసాయా కూలీలు ప్రతిరోజూ రాజధాని ప్రాంతంలోని నీరుకుండ గ్రామంలో మినుము పీకుడు పనులకు వెళుతున్నారు. రోజులాగేనే సోమవారం తెల్లవారుజామున బయలుదేరారు. పొగమంచు రోడ్డును కమ్మేసింది. ఆటో నారాకోడూరు గ్రామం దాటి గుంటూరు వైపు వస్తోంది. అదే సమయంలో గుంటూరు వైపు నుంచి తెనాలి వెళుతున్న ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేశాడు. ఆ సమయంలో పొగమంచు ఉండటం కారణంగా ఎదురుగా వస్తున్న ఆటోను బస్సు డ్రైవరు గమనించలేదు. దీంతో ఆటోను వేగంగా ఢీ కొట్టాడు. ఆటో ఉన్న కూలీలందరూ రోడ్డుపైనా, రోడ్డు పక్కనా చెల్లాచెదురుగా ఎగిరి పడ్డారు. ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కూలీలు అల్లంశెట్టి అరుణ(39), తోట సీతారాములు (41), కుర్రా నాంచారమ్మ (40)లు ఘటన స్థలంలోనే మృతి చెందారు. అదే సమయంలో ప్రయాణిస్తున్న వాహనదారులు, పలువురు రైతులు ఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. గాయాలపాలై రక్తమోడుతున్న మహిళ కూలీలను స్థానికులే రహదారిపై నుంచి పక్కకు చేర్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్ఐ వెంకట కృష్ణ గాయపడిన మహిళ కూలీలను 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మృతి చెందిన మహిళల మృతదేహాలను స్థానికుల సహాయంలో పంచానామా నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి పంపించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గుంటూరు జీజీహెచ్‌లో ఎం శివమ్మ, ఎం శివపార్వతి, ఏ వెంకట రమణ, కే రత్నకుమారి, జీ మల్లేశ్వరి, కే ఆదిలక్ష్మి, ఆర్ సుబ్బమ్మ, ఏ కృష్ణకుమారి చికిత్స పొందుతున్నారు. మహిళ కూలీల మృత్యువాత పడిన సంఘటన గురించి తెలుసుకున్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతులకు నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు. సీఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్ పలువురు విచారం వ్యక్తంచేశారు.

సుద్దపల్లిలో విషాధ చాయలు ..

సుద్దపల్లి గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం విషాధ చాయలు నింపింది. ఒకే ప్రాంతానికి చెందిన మహిళలు ప్రతి రోజు దూరప్రాంతాలకు వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుని కుటుంబాలను పోషిస్తున్నారు. అందరితో చేదోడువాదోడుగా ఉంటున్న మహిళలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పాటు 8 మంది మహిళలు గాయాలు పాలై ఆసుపత్రిలో చేరడంతో గ్రామస్థులు దుఃఖంలో మునిగిపోయారు.

మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు అండగా ఉంటాం ..

- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బుడంపాడు-నారాకోడూరు రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్రంగా కలిచి వేసిందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. గుంటూరు జీజీహెచ్‌లో ఆయన క్షతగాత్రులను కలిసి పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వికి, అలాగే మృతదేహాలకు పంచనామా త్వరితగతిన పూర్తిచేసి కుటుంబ సభ్యులకు అప్పజెప్పాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. ఈ ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ధూళిపాళ్ల నరేంద్ర, పక్కన జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీ



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ కడియాల లలిత్ సాగర్, చిత్రంలో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

డాక్టర్ లలిత్ సాగర్‌కు టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్ అవార్డు

● అందజేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

నరసరావుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో టాప్5 కిడ్నీ సర్జన్‌గా నిలిచిన నరసరావుపేటకు చెందిన డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా అందజేసే 'టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్' అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు విశాఖపట్టణంలో జరిగిన 'టైమ్స్' మెగా కార్యక్రమంలో డాక్టర్ లలిత్ సాగర్ కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. పలువురు వైద్య ప్రముఖుల సమక్షంలో ఈ అవార్డును కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా అందుకోవడం చాలా అనందంగా ఉందని డాక్టర్ కడియాల లలిత్ సాగర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఎన్డీయే కూటమి ప్రభుత్వం హయాంలోనే వైద్యులకు తగిన ప్రోత్సాహం కల్పించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి మంచి వాతావరణం ఏర్పడిందన్నారు. అత్యంత ఖరీదైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించాలనే తన లక్ష్యానికి సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లే స్ఫూర్తి అని అన్నారు. ఐకానిక్ లీడర్ హెల్త్ కేర్ పేరిట అత్యుత్తమ వైద్య సేవలందించిన వైద్యులకు టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతి ఏటా ప్రతిభావంతులను ఎంపికచేసి ఈఅవార్డులను అందజేస్తుంది. ఇందులో భాగంగా టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్- 2025ను కిడ్నీ (యూరాలజీ) సర్జన్ డాక్టర్ కడియాల లలిత్‌కు దక్కింది. కార్యక్రమంలో డాక్టర్ కడియాల లలిత్ సతీమణి, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, వారి కుమారులు కడియాల అక్షయ్‌నంద, అభయ్‌వర్ధన్ పాల్గొన్నారు.

అంబటి సోదరులకు కార్పొరేషన్ అధికారులు దాసోహం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపణ

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని, అనుమతులు రద్దుచేసి ఆయా యాజమాన్యానికి కార్పొరేషన్ అధికారులు ఉత్తర్వులు జారీచేసినప్పటికీ వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా బహిరంగంగా గృహ ప్రవేశాలు చేయిస్తున్న గ్రీన్ గ్రేస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఏంటని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రశ్నించారు. గ్రీన్‌గ్రేస్ యాజమాన్యానికి దాసోహమయ్యారని ఆరోపించారు. ఈ విషయంపై సోమవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల విలేకరులతో మాట్లాడుతూ అంబటి మురళికి కార్పొరేషన్ అధికారులు ఎందుకు వంత పాడుతున్నారో చెప్పాలన్నారు. ఉన్నతస్థాయి కమిటీ వేసినప్పటికీ అక్రమ కట్టడాలపై ఏ చర్యలు తీసుకోకపోవడంపై ఆంతర్యం ఏమిటి కమిషనర్‌ను ప్రశ్నించారు. గ్రీన్‌గ్రేస్ యాజమాన్య అక్రమాలు, అవకతవకలను తాను నిరంతరం పోరాటం చేస్తున్నప్పటికీ కార్పొరేషన్ సిబ్బంది చూసిచూడనట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారో తెలియటం లేదన్నారు. కార్పొరేషన్ అధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు.

విద్యుత్ తీగ తగిలి కార్మికుడి మృతి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం తెనాలి పట్టణంలోని రజకపేటలో జరిగింది. కొల్లిపరకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు కేశన గోపి (34) రజకపేటలోని ఓ అపార్టుమెంట్ వద్ద పని చేస్తున్నాడు. ఈ క్రమంలో 3 అంతస్తుల భవనం వెలుపల వైపున పని చేస్తుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ తీగలను గోపి తాకాడు. దీంతో షాక్‌కు గురై కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పదేళ్ల లోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2వ పట్టణ ఎస్ఐ బాబురావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటిమట్టం సోమవారం నాటికి 537.70 అడుగులు ఉంది. ఇది 183.56 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8718, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 16,078, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2000, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్ ఫ్లో 37,076 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా 'ఇంద్రప్రస్థ' నాటిక



ఉత్తమ నటుడికి మెమెంటోను అందజేస్తున్న వెంకట్ నల్లపాటి

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి). మూడు రోజుల పాటు నిర్వహించిన రంగస్థలి 24వ జాతీయ ఆహ్వాన తెలుగు నాటిక పోటీలలో ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక నిలిచింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్, గుంటూరు వారి చిగురు మేఘం నాటిక నిలిచింది. ఉత్తమ నటుడిగా అన్నదాత నాటికలో అంకమ్మతాత పాత్రధారి చెంచు పున్నయ్య, ఉత్తమ నటిగా తితిక్ష నాటికలో భారతి పాత్రధారి ఎస్. జ్యోతిరాణి ఎంపికయ్యారు. ఉత్తమ రచన తితిక్ష , ఉత్తమ క్యారెక్టర్ నటుడు కావూరి సత్యనారాయణ (చిగురుమేఘంలో చిన్నయ పాత్రధారి) ఉత్తమ హాస్య నటుడు శేషయ్య (పక్కింటి మొగుడు నాటికలో సీతాపతి పాత్రధారి) ఉత్తమ విలన్ పవన్ కళ్యాణ్ (రాత నాటికలో అజయ్ పాత్రధారి) ఉత్తమ దర్శకత్వం ఎస్.రవీంద్రరెడ్డి (ఇంద్రప్రస్థం) ఉత్తమ మేకప్ ఉమా (తితిక్ష నాటిక), ఉత్తమ రంగాలంకరణ టి.బాబురావు (తితిక్ష నాటిక), ఉత్తమ సంగీతం కెవి.రమణ (పక్కింటి మొగుడు), ఉత్తమ బాల నటి సురభి వాగ్దేవి (రాత నాటిక) ఎంపికయ్యారు. ఉత్తమ జ్యూరీ బహుమతిని వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ 'రాత' నాటిక దక్కించుకుంది. న్యాయ నిర్ణేతలుగా నుసుము నాగభూషణం, మానాపురం సత్యనారాయణ, షేక్ బాజీ మస్తాన్‌లు వ్యవహరించారు.

విద్యుదాఘాతంతో బీహార్ కార్మికుడి మృతి



పవన్ మృతదేహం

వినుకొండటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై బీహార్ కార్మికుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని కారంపూడి రోడ్డు వద్ద ఐటీసీ కార్యాలయం వెనుక నూతనంగా నిర్మిస్తున్న ఓ అపార్ట్‌మెంట్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం బెసాలి జిల్లా బిల్సర్ ఘాట్ గ్రామానికి చెందిన పవన్‌కుమార్ అపార్ట్‌మెంట్‌లో టైల్స్ పనులు చేసేందుకు తోటి స్నేహితులతో కలిసి నెల రోజుల క్రితం వినుకొండకు వచ్చారు. సోమవారం అపార్ట్‌మెంట్‌లో పని చేస్తుండగా పక్కను ఉన్న విద్యుత్ వైర్ తగిలి షాక్‌కి గురై అపస్మారకంగా పడిపోయాడు. గమనిం చిన తోటి మిత్రులు హుటాహుటిన ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే పవన్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం పవన్ మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య వినీత నిండు గర్భిణిగా ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101,109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00



మాట్లాడుతున్న ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఉత్తమ ఆహారపు అలవాట్లతో ఒత్తిడి దూరం

● ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఆహారపు అలవాట్లతో ఒత్తిడి దూరం అవుతుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు తెలిపారు. సోమవారం వర్సిటీ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ, ఫుడ్ సైన్స్ డైటెటిక్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఎదురుగావున్న ఉజ్వలహోంలో 'ఒత్తిడి ఉపశమనంపై పౌష్టిక ఆహార ప్రభావం' అంశంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి.భవిత అధ్యక్షత వహించారు. ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ యువత ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటుపడి అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారని, చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హోమ్ నిర్వాహకులు సిస్టర్ రోజ్‌లీనా సీఎస్ఆర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మండూరు వెంకటరమణ, డాక్టర్ డి. జలజకుమారి, కౌన్సిలర్ ఎం. రూప, ఫుడ్ సైన్స్ న్యూట్రిషన్ విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆచార్య వెంకటేశ్వర్లు

అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

పెదకాకాని, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర కళాశాల పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం వర్సిటీ క్రీడా ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమానికి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, టోర్నమెంట్ ప్రెసిడెంట్ ఆచార్య ఎ.ప్రమీలరాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దూరవిద్య కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. ప్రమీలారాణి మాట్లాడుతూ రెండ్రోజుల పాటు జరిగే ఈ పోటీలను ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పిపిఎస్. పాల్‌కుమార్ మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని 10 కళాశాలల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని, అందులో వర్సిటీ వ్యాయామవిద్య కళాశాల, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, ఏబీఆర్ డిగ్రీ కళాశాల, కందుకూరులోని శ్రీగుప్తా డిగ్రీ కళాశాలల జట్లు లీగ్ దశకు చేరుకున్నట్లు తెలిపారు. పోటీలకు నిర్వాహక కార్యదర్శిగా బి.అప్పలరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.బుచ్చిబాబు, వై.వేళాంగిణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య మధు మూర్తి

వినూత్న ఆలోచనే నూతన ఆవిష్కరణలకు పునాది

● ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి

● ఆర్వీఆర్‌జేసీలో ప్రారంభమైన ఐడీఈ బూట్ క్యాంపు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వినూత్న ఆలోచనలే నూతన ఆవిష్కరణలకు పునాది అని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి అన్నారు. గుంటూరు రూరల్ మండలం, చౌడవరంలోని ఆర్వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త సహకారంతో, వాధ్వాని ఫౌండేషన్ నేతృత్వంలో ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ బూట్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్. కె.మధుమూర్తి మాట్లాడుతూ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అన్నిరంగాల్లో ముఖ్యపాత్ర పోషిస్తున్నదన్నారు. ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కె.గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలే పెట్టుబడులుగా మారి, నూతన స్టార్టప్‌లకు బీజం వేయాలని ఆకాంక్షించారు. అవేరా ఏ.ఐ మొబిలిటీ ఫౌండర్, సీఈవో డాక్టర్ ఎ.వెంకటరమణ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా స్టార్టప్‌లను నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఏఐసీటీఈ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఇంజనాగ భీమలింగేశ్వర్‌రెడ్డి, వాధ్వాని ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ సుప్రభా ఆర్ డాక్టర్. ద్రిష్ట దేజోయార్దర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సెంటర్‌ను ప్రారంభిస్తున్న విద్యాసాగర్

విజ్ఞాన్స్‌లో డ్రోన్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

గుంటూరు (విద్య) ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి):చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో డ్రోన్ టెక్నాలజీ సెంటర్ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ అటానమస్ సిస్టమ్స్)ను ప్రారంభించామని వర్సిటీ వైస్‌ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, విజ్ఞాన్స్ యూనివర్సిటీల సంయుక్త ఆర్థిక సౌజన్యంతో ఈ డ్రోన్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డీ.విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ సెంటర్ వలన విద్యార్థులకు డ్రోన్ డిజైన్, వినియోగం, ప్రోగ్రామింగ్‌పై శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

1,43,296 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,63,393 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,43,296 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 68,321 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13600	334	--	--
నంబరు. 5	11000	14300	నంబరు. 5	--	--
273	10000	12300	273	--	--
341	10000	14000	341	--	--
4884	10000	12800	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	11000	14000	తేజ	--	--
బ్యాడిగి	10000	13500	బ్యాడిగి	--	--
దేవనూరు డీలక్స్	10000	13000	దేవనూరు డీలక్స్	--	--
తాలుకాయలు	4500	7000	ఏసీ తాలుకాయలు	--	--

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు


సత్రశాల ఆలయం వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

మహాశివరాత్రికి విస్తృత బందోబస్తు : ఎస్పీ

రెంటచింతల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే తిరునాళ్లకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు ఎస్పీ కె.శ్రీనివాసరావు చెప్పారు. కృష్ణానది ఒడ్డునగల శైవ క్షేత్రం సత్రశాలను సోమవారం ఆయన సందర్శించి చేపట్టాల్సిన చర్యలను డీఎస్పీ జగదీష్‌తో చర్చించారు. ట్రాఫిక్‌పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అలాగే ఈనెల 27న నిర్వహించనున్న గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి వైఆర్ఎస్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్‌బూత్‌ను పరిశీలించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారికి వైద్యపరంగా సహాయం అందించేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని, అటువంటి వారికి ప్రభుత్వపరంగా ప్రోత్సాహం ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్పీ సీఐ సురేష్, సీఐలు భాస్కర్, శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ నాగార్జున, ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

తిరునాళ్ల ఏర్పాట్ల పరిశీలన

కారంపూడి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శాంతియుత వాతావరణంలో తిరునాళ్ల వేడుకలు నిర్వహించాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఒప్పిచర్లలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల సందర్భంగా భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ తిరునాళ్లలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరా ద్వారా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయపార్టీల ప్రసంగాలు నిషేధమన్నారు.

జాతరలో ఎలాంటి గొడవలు లేకుండా చూడాలి: సీఐ సురేష్

బెల్లంకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపాయపాలెం గ్రామంలో ఈనెల 27, 28, మార్చి 1న జరిగే మహాలక్ష్మమ్మ జాతరలో ఎలాంటి గొడవలు లేకుండా చూడాలని రూరల్ సీఐ సురేష్ పేర్కొన్నారు. సోమవారం పాపాయపాలెం మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద గ్రామస్తులతో సమావేశం ఏర్పాటుచేశారు. గ్రామంలో జాతరకు సుమారు 50వేల నుంచి లక్షమంది ప్రజలు హాజరవుతారని, పోలీసు బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణంలో జాతరను జరుపుకోవాలన్నారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ ప్రసాదు, ఆలయ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

ఇండో ఇజ్రాయిల్ అగ్రికల్చర్ ప్రాజెక్టును పరిశీలించనున్న ప్రతినిధులు

నకరికల్లు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇండో ఇజ్రాయిల్ అగ్రికల్చర్ ప్రాజెక్టును ఈనెల 18వ తేదీన వ్యవసాయ ప్రతినిధి యూరీ రూబీన్ స్టైన్ పరిశీలిస్తారని జిల్లా ఉద్యానశాఖ అధికారి రమణారెడ్డి తెలిపారు. గుండ్లపల్లిలో నిర్మాణంలో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఆయన సందర్శించనున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా మిట్టగుడిపాడు తిరునాళ్ల

రెంటచింతల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టగుడిపాడు గ్రామ తిరునాళ్ల సోమవారం భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. రెండు ఆలయాల్లో నిర్వహించిన శివపార్వతులు, రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి కల్యాణంలో భక్తులు పాల్గొన్నారు. భారీగా అన్నదానం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ గొట్టం ప్రమీలగురవారెడ్డి, ఈవో గాదె రామిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్ఐ నాగార్జున భారీస్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

పెన్షనర్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి

● అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆ యన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో పెన్షనర్లకు ఎంతో నష్టం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మందా నరసింహయ్య, చంద్రయ్య, గాలీబు, గౌస్‌మొహిద్దీన్, అంజయ్య, లక్ష్మణరావు, వెంకటరెడ్డి, నారాయణ, వెలుగొండారెడ్డి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

కందిపంట అమ్ముకొనేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

మాచవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్దతు ధరకు కందులు అమ్ముకొనే రైతులు ఆయా గ్రామాల రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామమ్మ రైతులకు సూచించారు. సోమవారం మాచవరంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. పొలం ఉన్న ప్రతి రైతు ప్రభుత్వ పథకాలు అందాలంటే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబరు తీసుకొని రైతు సేవా కేంద్రానికి వెళితే రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తమ స్థలం చూపించాలని వినతి

దుర్గి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తన కుమారుడు రాయపాటి మరియదాసు 2003లో హత్యకు గురయ్యాడని, ఆ సమయంలో ప్రభుత్వం 2.50 ఎకరాల కేటాయించిందని మరియదాసు తల్లి దానమ్మ తెలిపారు. అయితే ఆ భూమి అటవీస్థలంలో కలిసిపోయిందని, తమ స్థలం చూపాలంటూ తహసీల్దార్ ఫణీంద్రకుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాచర్లటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం నెహ్రూనగర్, గుంటూరు రోడ్డు, పార్కుసెంటర్, బస్టాండ్, రామాటాకీస్, సుద్ధగుంతల, జెండాచెట్టు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు.

గుర్తు తెలియని మృతురాలి వివరాలు లభ్యం

వెల్దుర్తి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టమీదపల్లె శివారులోని కుంటలో లభ్యమైన మృతురాలి వివరాలను ఎస్ఐ సమందర్ సోమవారం వివరించారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలం రామచంద్రాపురం కోటకు చెందిన మునుగంటి మల్లీశ్వరిగా గుర్తించారు. మృతికి గల వివరాలు తెలియాల్సి ఉంది.

సిద్ధాంతం, విలువలు ప్రభుత్వం ఆచరణలో చూపాలి

మాజీ ఎమ్మెల్యే కాసు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): చంద్రబాబునాయుడు సిద్ధాంతాలు, విలువలు చెప్పడం కాదు.. ఆచరణలో చూపిస్తే ప్రభుత్వాలు నిలబడతాయని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. సోమవారం నరసరావుపేటలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పిడుగురాళ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికలాంటి చిన్నదానికి కూడా అదిరించి, బెదిరించి, దాడులు చేసి, పోలీసుల చేత కిడ్నాప్ చేయించి నిర్వహించడం దారుణమన్నారు. మున్సిపల్ చైర్మన్ సుబ్బారావును ఫ్యాక్టరీకి తాళాలు వేస్తాం, బిల్లులు ఆపుతాం, కేసులు పెడతామని బెదిరించి వైస్‌చైర్మన్ గెలిచారన్నారు. హామీలు నేరవేర్చకుండా పక్కదారి పట్టించడానికి ప్రభుత్వం ఈ గొడవలు సృష్టిస్తుందన్నారు. బెదిరించి, కొంతమందికి డబ్బులిచ్చి లాక్కున్నంత మాత్రాన వైసీపీ క్యాడర్ భయపడదన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో తప్పనిసరిగా పోరాటం చేస్తామన్నారు. ఎవరైతే అధికారులు అతిగా చేస్తున్నారో వాళ్ళపై కేసులు నమోదుచేసి విచారించి రాబోయే వైసీపీ ప్రభుత్వం డిస్‌మిస్ చేస్తుందని మహేష్‌రెడ్డి హెచ్చరించారు.


గుర్తు తెలియని మృతదేహం

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మాచర్లలో చోటుచేసుకుంది. పట్టణ శివారులోని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద మధ్యాహ్న సమయంలో అకస్మాత్తుగా గిలగిల కొట్టుకుంటూ వ్యక్తి పడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని వయసు 50 యేళ్లు ఉండవచ్చని, ఒంటిపై చొక్కా లేదని, నలుపు రంగు నిక్కరు ధరించి ఉన్నాడని పట్టణ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 31.06 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామన్నారు.

పిడుగురాళ్ల పురపాలక సంఘం టీడీపీ వశం


వైస్‌చైర్మన్‌గా ఎన్నికైన వున్నం భారతి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పురపాలక సంఘం చైర్మన్ పీఠం టీడీపీ ఖాతాలోకి జమ అయింది. మొత్తం 33మంది వైసీపీ కౌన్సిలర్లకుగాను 17మంది టీడీపీలోకి చేరటంతో పురపాలక సంఘం టీడీపీ ఖాతాలోకి చేరింది. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక ప్రక్రియకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయటంతో ఈ నెల 3 తేదీన వైస్‌చైర్మన్ ఎన్నికకు సమావేశం నిర్వహించగా కొందరు సభ్యులు గైర్హాజరయ్యారు. దీంతో ఎన్నిక వాయిదాపడింది. సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు సహా కొంతమంది సభ్యులు మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా వున్నం భారతిని ఎన్నుకోవటంతో పాటు ఆ వెంటనే 17మంది సభ్యులు టీడీపీ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. దీంతో పిడుగురాళ్ల పురపాలక సంఘం టీడీపీ ఖాతాలోకి చేరింది. సోమవారం చేరిన 17మంది కౌన్సిలర్లతో పాటు మరికొంతమంది కూడా త్వరలో వైసీపీని వీడేందుకు టీడీపీ నేతలతో మంతనాలు జరుపుతున్నారు. వైసీపీ హయాంలో ఆ పార్టీలోని కొందరు నాయకుల వ్యవహార శైలితో విసిగిపోయామని, గత నాలుగేళ్లుగా వార్డులలో గుంతలు కూడా పూడ్చలేని స్థితిలో కౌన్సిలర్లుగా ఉండటం సిగ్గుగా ఉందని పలువురు కౌన్సిలర్లు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. పిడుగురాళ్ల వైస్‌చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో 17మంది కౌన్సిలర్లు వైసీపీని వీడటం ఆ పార్టీకి గట్టి షాక్ ఇచ్చినట్లయింది. దీంతో వైసీపీ నేతలలో భయం పట్టుకుంది. అంతేకాకుండా గురజాల, దాచేపల్లి నగర పంచాయతీలకు సంబంధించి వైసీపీ కౌన్సిలర్లు కొందరు ఆ పార్టీని వీడేందుకు ఇప్పటికే పలుమార్లు టీడీపీ నేతలతో మంతనాలు జరిపినట్లు సమాచారం. త్వరలో ఆ రెండు నగర పంచాయతీ పీఠాలు కూడా టీడీపీ ఖాతాలోకి వచ్చే అవకాశముంది. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి కొద్దో గొప్పో ఉన్న క్యాడర్ కూడా పార్టీని వీడేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో వైసీపీ నేతలు క్యాడర్‌ను నిలబెట్టుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.

టీడీపీలో ఎవరెవరు చేరారంటే....

24వ వార్డు కొత్త వెంకటసుబ్బారావు(మున్సిపల్ చైర్మన్), 30వ వార్డు వున్నం భారతి (వైస్‌చైర్మన్), కొత్త పుష్పలత(21వ వార్డు), కొత్త తులసి(20), జోగిపర్తి సుజాత(18), నంద్యాల ఆంజనేయులు(1), బడిగుంతల నాగమణి(5), అజ్మీర శారద(6), కుక్కమూడి మేరికుమారి(11), పసుపులేటి ఆనందబాబు(17), తురకా ముక్కంటి(27), గర్రె నాగేశ్వరరావు(28), షేక్ సైదావలి(31), షేక్ సైదాబి(32), ఉప్పు దేవి(33) టీడీపీలో చేరగా, 26వ వార్డు నాగోజు పద్మావతి, 4వ వార్డు పోలు శ్రీనివాసరెడ్డిలు మద్దతు తెలిపారు.

ప్రజలకు రెవెన్యూ సేవలను వేగవంతంగా అందించాలి

జాయింట్ కలెక్టర్ సూరజ్ ఘనోరే


ఫైళ్లను పరిశీలిస్తున్న జేసీ సూరజ్ ఘనోరే, పక్కన తహసీల్దార్ పుల్లారావు

నకరికల్లు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రెవెన్యూ సేవలను వేగవంతంగా అందించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ఘనోరే రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జేసీ సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పబ్లిక్ గ్రీవెన్స్, పీజీఆర్ఎస్ అమలు తీరు గురించి అర్జీదారులతో మాట్లాడారు. 167ఏ పొందుగుల ఓడరేవు జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులు సూరజ్‌ను కలుసుకున్నారు. చల్లగుండ్ల గ్రామానికి చెందిన రైతులు రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న తమకు పరిహారం ప్రభుత్వం ఇచ్చేది తక్కువగా ఉందని, పరిహారాన్ని పెంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. కాగా రైతులు తమ అభిప్రాయాలను కలెక్టర్‌ని కలసి వెల్లడించాలని సూచించారు. కలెక్టర్ అరుణ్ బాబుతో తాను ఈ విషయమై చర్చిస్తానని రైతులకు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది పని తీరును, ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను జేసీ తహసీల్దార్ పుల్లారావును అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారుల పై నివేదికలు ఇవ్వాలన్నారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసే ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులను పరిశీలించారు. వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రెవెన్యూ సేవల తీరుపై జేసీ సంతృప్తి వ్యక్తం చేశారు.

కూటమికి మద్దతిచ్చి అభివృద్ధిలో భాగస్వాములవ్వండి : ఎమ్మెల్యే జూలకంటి


ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న పట్టభద్రుల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా స్థానిక పట్టభద్రులను సోమవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటినుంచే సీఎం చంద్రబాబు అనేక పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో ఇప్పటికే పలుదఫాలుగా జాబ్‌మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు. ప్రచారంలో నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు మద్దిరాల మ్యాని, పోలూరి నరసింహారావు, యెనుముల కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, క్లస్టర్ ఇన్‌చార్జి సయ్యద్ అన్వర్‌బాషా, అక్కిరెడ్డి, కజ్జం సైదయ్య, క్రాంతికుమార్, చిన వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ఆలపాటిని మొదటి ప్రాధాన్య ఓటుతో గెలిపించండి

మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి


బలుసుపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆలపాటి రాజేంద్రప్రసాదును పట్టభద్రులు మొదటి ప్రాధాన్య ఓటును వేసి గెలిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ కోరారు. మండలంలోని బలుసుపాడు, అమరావతి మండలం లేమల్లెలో సోమవారం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి గెలుపు కోసం సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట తెలుగురైతు జిల్లా ప్రధానకార్యదర్శి భాష్యం ఆంజనేయులు, టీడీపీ మండల నేతలు మద్దినేని నరసింహారావు, ఘంటా పాపయ్య, భాష్యం జగదీష్, నెట్టెం హరిబాబు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

● ఎంఎల్‌సీ ఎన్నికల బరిలో కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజాను గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ కోరారు. పెదకూరపాడులో ఆలపాటికి మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మాజీ ఎంపీపీ గల్లా బాబూరావు, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటికి మద్దతుగా నిలవాలి..

అచ్చంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎంఎల్‌సీగా ఆలపాటి రాజాకు మొదటి ప్రాధా న్య ఓటువేసి గెలిపించాలని అచ్చంపేట టీడీపీ నాయకుడు తిరువాయిపాటి ఆంజనేయులు కోరారు. అచ్చంపేటలో పలువురు ఉపాధ్యాయులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనేకమంది ప ట్టభద్రులను కలసి ఓట్లు అభ్యర్థించారు.

● క్రోసూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు ప్రథమ ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు గుడిపాడు బాషా కోరా రు. క్రోసూరులోని వ్యాపారసంస్థలు, ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారపత్రాలను అందజేసి ఓట్లను అభ్యర్థించారు. టీడీపీ నాయకులు బండారు మైసూరుబాబు, మన్నెం శివయ్య, దుద్దుల యోహాన్, అనుమాల పూర్ణ, మన్నెం శ్రీనివాసరావు, నలజాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబటి... నోరు జారితే తాట తీస్తాం..

● కూటమి నేతలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబు నోరుజారితే తాటతీస్తామని కూటమి నేతలు హెచ్చ రించారు. టీడీపీ ప్రజావేదికలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం సహాయనిధి చెక్కుల్లో కూడా కమీషన్ కోసం కక్కుర్తిపడిన వ్యక్తి అంబటి అన్నారు. నియోజకవర్గంలో జగనన్న కాలనీల పేరిట భూమి కొనుగోళ్ళల్లో ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని గెస్ట్ హౌస్ నిర్మించుకున్నారన్నారు. సంక్రాంతి సంబరాలకు లాటరీటిక్కెట్లు అమ్ముకున్నారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి ప్రతి పనికి డబ్బు వసూలు చేశారన్నారు. అంబటి తమ్ముడు మురళీ, అల్లుడు నియోజకవర్గంలో సహజవనరులను దోచుకున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను విమర్శించే నైతికహక్కు అంబటికి లేదన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, సయ్యద్ మాబు, బత్తుల నాగేశ్వరరావు, కంభాల వెంకటేశ్వరరావు, పూజల వెంకట కోటయ్య, ఆతుకూరి నాగేశ్వరరావు, వీరభాస్కర్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కట్టా శంకరరావు, జనసేన నేత తవిటి భావన్నారాయణ, దివ్వెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● జగన్‌రెడ్డి చెంచా అయిన అంబటి రాంబాబు ఎమ్మెల్యే కన్నాపై సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేయటం తగదని తెలుగు యువత రాష్ట్ర అధికారప్రతినిధి వక్కంటి అజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలి

● డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం ద్వారా ప్రతి కుటుంబానికి వందరోజులు పనికల్పించటమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పని చేయాలని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి అన్నారు. ఈ పథకంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. లింగమూర్తి మాట్లాడుతూ ఇంకుడుగుంతలు, వంద రోజులు పనికల్పించటం, సరాసరి వేతనం, శ్రమశక్తి సంఘాలు, హౌసింగ్ 90 రోజుల పనిదినాలు, ఉద్యానపంటలు, లేబర్ బడ్జెట్ గురించి ఆయన సమీక్షించారు. సమావేశంలో సత్తెనపల్లి, రాజుపాలెం, నకరికల్లు మండలాల ఎంపీడీవోలు బండి శ్రీనివాసరెడ్డి, జీవీ సత్యనారాయణ, జీ.కాశయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఏపీడీ పీవీ నారాయణ, ఆయా మండలాల ఏపీవో తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి

కరాటే పోటీల్లో మొదటిస్థానంలో మోడల్ స్కూల్ విద్యార్థులు

దాచేపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరిగిన కరాటేపోటీల్లో బాలికల విభాగంలో దాచేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు మొదటిస్థానంలో నిలిచి ప్రతిభ చాటారు. సోమవారం స్కూల్ ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ ఈనెల 16న అద్దంకిలో జాతీయస్థాయి బాలికల కరాటే పోటీలు జరిగాయి. పోటీల్లో బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన సీహెచ్ మిషిత బ్లెస్సీ మొదటిస్థానం, వినుకొండ సువన్య రెండోస్థానం, బాలుర విభాగంలో సీహెచ్ రిలేష్ రెండోస్థానంలో తమ ప్రతిభను చాటుకున్నారు. కోచ్ అచ్చయ్యను ప్రిన్సిపాల్ రవికుమార్, పీడీ బాలాజీనాయక్ అభినందించారు.

ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ముగ్గురు డ్రైవర్లు ప్రమాదరహిత అవార్డు గ్రహీతలుగా ఎంపికయ్యారు. రోడ్డు భద్రతావారోత్సవాల సందర్భంగా ఈ అవార్డుకు కె.నాగేశ్వరరా వు, కె.రామారావు, ఎంఎన్‌రావు ఎంపికయ్యారు. డిపో మేనేజర్ కోటేశ్వరరావు నాయక్ ముగ్గురు డ్రైవర్లను సత్కరించారు. వీరికి సర్టిఫికెట్లను అందించారు.

బాల్య వివాహాలు, గృహహింసను అరికడితేనే సురక్షిత గ్రామాలు

పెదకూరపాడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, గృహహింస లేని గ్రామాలే సురక్షిత గ్రామాలని ల్యాంప్ సంస్థ కో-ఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని జలాలపురంలో షై చాయిస్ ఫౌండేషన్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామజ్యోతి పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు అరికట్టడం, అక్రమ రవాణా జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ట్రైనర్ షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.


13వ వార్డులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఆలపాటికి మద్దతునివ్వండి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం ఉపాధ్యాయులు, రిటైర్డు ఉద్యోగులతో స్థానికంగా సమావేశమయ్యారు. ఎన్నికల పరిశీలకుడు, ఆంధ్రప్రదేశ్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారెడ్డి, వేములకొండ శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్సీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యేలినేడి రామస్వామి, ఆతుకూరి నాగేశ్వరరావు, కట్టా శంకరరావు, కంభాల వేంకటేశ్వరరావు, నూర్‌బాషా జాన్‌బాబు, పూజల వెంకటకోటయ్య, పోట్ల ఆంజనేయులు, కోమటినేని శ్రీనివాసరావు, ఖాజావలి ఉన్నారు. ఎమ్మెల్యే కన్నా ఆదేశాల మేరకు ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ 3వ వార్డు సుగాలీకాలనీ హైస్కూల్‌లో టీడీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. మండలంలోని కంకణాలపల్లి హైస్కూల్‌లో టీడీపీ నేతలు ఉపాధ్యాయులను కలసి ప్రచారం నిర్వహించారు.

● సత్తెనపల్లి రూరల్: ఎంఎల్‌సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలని టీడీపీ గ్రామ నాయకులు కోరారు. పార్టీ నాయకులు కంకణాలపల్లి, వెన్నాదేవిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముండ్ర శ్రీనివాసరావు, పచ్చా అప్పారావు, పుష్పరాజ్ సోలానంబీ, సుదర్శనం మాధవరావు, కిలారీ వేణు తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లులో...

నకరికల్లు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలని టీడీపీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ అలీబాషా కోరారు. నకరికల్లులోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆకుల వెంకటేశ్వర్లు, అనుమోలు శ్రీనివాసరావు, చింతా పుల్లయ్య, షేక్ ఖాశిం, ఎం కాశీ విశ్వనాథం, నాగుల్ మీరా పాల్గొన్నారు.

రాజుపాలెం మండలంలో...

రాజుపాలెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఒకటో ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సోమవారం కూటమి నేతలు రాజుపాలెం మండలంలో ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. మండలంలోని చౌటపాపాయపాలెం, అనుపాలెం, అంచులవారి పాలెం, కొత్తబోదనం, కొండమోడు, నెమలిపురి గ్రామాలలోని పాఠశాలలోని ఉపాధ్యాయులను కలసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, మాజీ ఎంపీపీ నర్రా బాబురావు, అంచుల నరసింహారావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిన్నబోయిన రాఘవరావుయాదవ్, సర్పంచ్‌లు తోట శ్రీనివాసరావు, కుందూరు పేతురు, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి నల్లమోతుల శ్రీనివాసరావు, కాపు సంఘం మండల అధ్యక్షుడు పులిబండ్ల సాంబశివరావు, గంజి శ్రీను, చిమట సైదారావు, వర్ల శ్రీను ఉన్నారు.

రెండు రోజుల్లో అవసరం మేరకు యూరియా..

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రెండురోజుల్లో అవసరం మేరకు యూరియా నిల్వలు అన్ని రైతుసేవా కేంద్రాలు, సహకారసంఘాల్లో అందుబాటులో రానున్నాయని ఇన్‌చార్జ్ ఏడీఏ, ఏవో ఎస్.శ్రీధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలో రబీ సీజన్‌లో రెండు వేల ఎకరాల్లో వరి, 5,500 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగులో ఉన్నాయన్నారు. వీటి అవసరార్థం యూరియా కొరకు ఇండెంట్ పెట్టామని తెలిపారు. యూరియా కొరత ఉండదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం పలు ప్రైవేట్ గోదాముల్లో యూరియా నిల్వలను ఆయన పరిశీలించారు.

5వ తరగతి, ఇంటర్‌లో చేరే విద్యార్థులు గురుకుల పాఠశాలకు దరఖాస్తు చేసుకోవాలి

అచ్చంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చేరగోరు విద్యార్థులు తక్షణమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అచ్చంపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టీ అరుణ్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అచ్చంపేటలో 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్‌లో ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40 సీట్లు ఉన్నట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు ఏప్రిల్ 6 చివరి తేదీ అన్నారు. వివరాలకు అచ్చంపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పీ అరుణ్ కుమార్, సెల్ 90596 60634లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

హెల్మెట్ పెట్టుకోండి...సీటు బెల్టు ధరించండి

నకరికల్లు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాల్లో ప్రయాణించే వ్యక్తులు సీటు బెల్టు పెట్టుకోవాలని ఎస్ఐ చల్లా సురేష్ సూచించారు. ప్రయాణాల్లో అనుకోని ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్, సీటుబెల్టు ప్రాణాలకు రక్షణగా నిలుస్తాయన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

● మార్కెటింగ్ ఎంటీ అంజలి


ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను విక్రయిస్తున్న దృశ్యం

బెల్లంకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ప్రజలకు ఆరోగ్యం లభిస్తుందని బెల్లంకొండ మండల మార్కెటింగ్ ఎంటీ అంజలి పేర్కొన్నారు. సోమవారం బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తుల స్టాల్స్‌ను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏర్పాటుచేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా మహిళలు పండించే ఆకుకూరలు, కూరగాయలు, కందిపప్పు, మినపప్పు, మినుములు, రాగులు, ఆవాలను విక్రయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ధర్మ, తేజశ్రీ, ప్రవీణ, హజరాబీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కేటింగ్ పోటీల్లో క్రోసూరు విద్యార్థుల ప్రతిభ

క్రోసూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఐసీఈ ఆధ్వర్యంలో గుంటూరులో ఆదివారం జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కేటింగ్ పోటీల్లో క్రోసూరు సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీరజిత తెలిపారు. 13 జిల్లాల నుంచి 600మంది క్రీడాకారులు పాల్గొనగా తమ విద్యార్థులు ఏడుగురికి గోల్డ్, సిల్వర్ మెడల్స్ వచ్చినట్టు తెలిపారు. 11-13 క్యాటగిరీలో ప్రగ్నన్, 8-11 క్యాటగిరీలో అబ్దుల్ హమీద్, 13-15 క్యాటగిరీలో వెంకటేష్ బేసిక్ ఇన్ లైన్ గోల్డ్ పతకాలు, 6-8 క్యాటగిరీలో బిందుశ్రీ బేసిక్ లైన్ సిల్వర్, 8-11 క్యాటగిరీలో జ్ఞానేశ్వర్ ప్రొఫెషనల్ ఇన్ లైన్ బ్రాంజ్ మెడల్, 13-15 క్యాటగిరీలో సాహిద్, 11-13 క్యాటగిరీలో గౌతమ్ బేసిక్ ఇన్ లైన్ బ్రాంజ్ మెడల్స్ సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రజిత, పీఈటీ మక్కెన వెంకటరావు అభినందించారు.

ఇంటింటా.. సౌర వెలుగులు!

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి విద్యుత్ రంగంలో సంస్కరణలపై పెద్దఎత్తున దృష్టిపెట్టిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఇంటికప్పుపై సౌర విద్యుత్ ఉత్పత్తిపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను ముమ్మరం చేసింది. దశల వారీగా పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఉన్న అన్ని ఇళ్లకు సౌర కాంతులు అందేటట్లు ప్రణాళికా బద్ధంగా ప్రభుత్వం ముందుకెళుతోంది. కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకం దన్నుగా దీనిని పూర్తిస్థాయిలో అమలు చేయడానికి యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్ల రూఫ్‌టాఫ్ సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఉచితంగా అందివ్వడానికి మార్గదర్శకాలను ప్రభుత్వం గతంలోనే విడుదల చేసింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ వివరాలను సేకరించిన యంత్రాంగం ఆ జాబితాను ప్రభుత్వానికి పంపింది. మిగిలిన వారికి రాయితీపై ఈ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంది. దీనికి సంబంధించి త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదలవడంతో పాటు లబ్ధిదారులకు సౌరవిద్యుత్ ఫలాలు అందించే విధంగా కూటమి ప్రభుత్వం అడుగు లేస్తోంది

- పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాఫ్‌ల ఏర్పాటు
- గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ సౌర కాంతులు



- లబ్ధిదారులను గుర్తించే పనిలో యంత్రాంగం
- ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితంగా యూనిట్లు
- తొలి విడతలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 5 లక్షల కుటుంబాలకు లబ్ధి
- ప్రభుత్వ కార్యాలయాల్లోనూ సౌర విద్యుత్‌కే మొగ్గు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాప్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు యూనిట్‌కు అయ్యే వ్యయంతో పాటు దాని ద్వారా తక్కువ ఖర్చుతో విద్యుత్ ఎలా పొందవచ్చో అనే దానిపై ఇప్పటికే పెద్దఎత్తున ప్రజలకు అవగాహన కల్పించడంతో దరఖాస్తులు భారీగానే వచ్చాయి. వాటి ఆధారంగా లబ్దిదారుల జాబితాను తయారు చేసే పనిలో యంత్రాంగం నిమగ్నమయింది. పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందించే 2 కిలో వాట్ల రూఫ్‌టాఫ్ సౌర విద్యుత్ యూనిట్ వ్యయం రూ.1.80 లక్షలుగా ఉంది. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే రాయితీ రూపంలో భరించనున్నాయి. కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్రం భరించేది 40 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పై కప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలో వాట్ సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అయ్యే ఖర్చులో 40 నుంచి 60 శాతం వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాయితీలు అందిస్తున్నాయి

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా....

సోలార్ రూఫ్‌టాప్‌లను పీఎం సూర్యఘర్ పథకం కింద అమర్చుకోవడానికి ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను గతంలోనే ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈ ప్రక్రియ చేపట్టారు. వీటి ఆధారంగా సంబంధిత సర్వీస్ కనెక్షన్ నెంబరు, మొబైల్ నంబరు యాప్‌లో నమోదు చేయగానే వినియోగదారుడికి వచ్చే ఓటీపీ ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది

చార్జీల భారం తగ్గించడమే లక్ష్యంగా...

ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్యుత్ విభాగాన్ని తిరోగమన బాట పట్టించడమే కాకుండా వినియోగదారులను కరెంటు చార్జీల రూపంలోఎడాపెడా బాదేసింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడంతో సోలార్ విద్యుత్‌ను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని అడుగులేస్తుండడం, అందుకు సంబంధించిన కార్యాచరణ కూడా పీఎం సూర్య ఘర్ పథకం రూపంలో వేగం అందుకోవడంతో త్వరలోనే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చాలా ఇళ్లు సౌర కాంతులు వెదజల్లనున్నాయి

వినియోగాన్ని బట్టి....

ఇళ్లల్లో వాడే విద్యుత్ వినియోగం ఆధారంగానే ఎంత కిలోవాట్‌ల రూఫ్‌టాప్‌లు అవసరం అవుతాయనే విషయంలో లబ్దిదారులు అంచనాకు రావాల్సి ఉంది. నెలకు ప్రస్తుతం 150 యూనిట్లకు దిగువనే కరెంటు వాడేవారు ఒక కిలో వాట్, 150 నుంచి 300 యూనిట్ల మధ్యలో వారైతే రెండు కిలోవాట్స్, 300 యూనిట్ల కంటే అదనంగా వినియోగించే వారు మూడు కిలోవాట్స్ సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్లను అమర్చుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలి విడతలో దాదాపు 5 లక్షల కుటుంబాలు ఈ పథకం కింద లబ్ధి పొందుతుండగా దాదాపు 65 శాతం మంది వినియోగదారులు రెండు కిలోవాట్స్ కేటగిరీలోనే ఉండడం గమనార్హం.

ప్రభుత్వ కార్యాలయాల్లోనూ...

గత ప్రభుత్వ నిర్వాకంతో వివిధ ఆఫీసులకు సంబంధించి లక్షల్లో కరెంటు బిల్లులు పేరుకుపోయాయి. బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఒక్క ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిలే దాదాపు రూ.2.50 కోట్లుగా ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో ఎక్కువగా రెవెన్యూ విభాగానివే ఉండడం గమనార్హం. ఇక గ్రామ పంచాయతీల పరిధిలో బకాయిలు ఉన్న కరెంటు బిల్లులు అయితే కొండలా పేరుకుపోయాయి. వీటిని చెల్లించడమే ప్రస్తుత ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాల్‌గా తయారయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం సౌర విద్యుత్ వాడకాన్ని పెంచడం వల్ల ఖజానాపై భారం తగ్గుతుందనేది పాలకుల ఆలోచనగా ఉంది. ప్రభుత్వ ఆధీనంలో నడిచే కార్యాలయాలు, సంస్థల కోసం కేంద్రం ప్రత్యేకంగా రెస్కో నమూనాను తీసుకొచ్చింది. ఈ విధానంలో భాగంగా వాటా సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేకుండా ఏర్పాటు, నిర్వహణ అంతా ఉచితంగానే కేంద్రమే సమకూరుస్తుంది. కాకపోతే తర్వాత సౌర విద్యుత్ వాడకానికి యూనిట్‌కు రూ.4 చెల్లించడమే రెస్కో విధానంగా ఉంది. ఇలా 25 ఏళ్ల పాటు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంటారు. దీనివల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో కరెంటు బిల్లుల్లో సైతం రూ.కోట్లలో సొమ్ము ఆదా అయ్యే అవకాశం ఉంటుంది.

మధ్యతరగతి, పేదలకే ఎక్కువ లబ్ధి..

సూర్యఘర్ పథకం కింద సోలార్ లబ్ధిదారుల ఎంపికను ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో దృష్టి సారించడంతో పాటు, ఎస్సీ, ఎస్టీలకు ప్రతి ఒక్కరికీ ఈ ఫలాలు అందేలా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ముఖ్యంగా కరెంటు వినియోగానికి గతంతో పోలిస్తే అయ్యే ఖర్చును సౌర విద్యుత్ రూపంలో తక్కువగా అయ్యేటట్లు చూడడంతో పాటు మిగులు విద్యుత్‌ను ఉత్పత్తి చేసే విధంగా గ్రామాలను తయారు చేసే విధంగా ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకెళుతోంది. దశల వారీగా సోలార్ కాంతులను పంచే ఇళ్లను పెంచడంతో పాటు మరింత మందికి ఈ పథకం గురించి అవగాహన కల్పించి మధ్యతరగతి, పేద వర్గాలకు న్యాయం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది

చికెన్ @ 100



- చికెన్ కొనుగోళ్లపై బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్
- గణనీయంగా పడిపోయిన అమ్మకాలు
- ధరలు తగ్గించిన కొందరు వ్యాపారులు

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ వ్యాపారానికి గడ్డుకాలం ఏర్పడింది. బర్డ్ ఫ్లూ ప్రచారంతో చికెన్ కొనుగోలు చేసేందుకు ప్రజలు జంకుతుండటంతో కొనుగోళ్ళు గణనీయంగా పడిపోయాయి. మరో వైపు చికెన్ ధర కూడా రూ.100లకు దిగజారిపోయింది. చికెన్ కిలో రూ. స్కిన్‌రూ.90, స్కిన్ లెస్ రూ.100 లకు విక్రయిస్తున్నారు. గుంటూరులోని జీటీ రోడ్డు, నగరంపాలెం, నల్లచెరువు వంటి కొన్ని ప్రాంతాల్లో ధరలు తగ్గిస్తూ కిలో రూ. 100 అంటూ కొందరు వ్యాపారులు స్టాల్స్‌లో బోర్డులు ఏర్పాటు చేశారు. గత నెలలో చికెన్ కిలో గరిష్ఠంగా రూ. 270 వరకు విక్రయించారు. ఆ తరువాత కిలో రూ. 250లకు అమ్మకాలు జరిపారు. ఈనెల ప్రారంభంలోనే తెలంగాణలో బర్డ్ ఫ్లూ ప్రచారం పెద్దఎత్తున జరగటం, అక్కడ ప్రభుత్వం అధికారికంగానే చికెన్ విక్రయాలను కొన్ని జిలాల్లో నిషేధించిన విషయం తెలిసిందే. ఈ ప్రచారంతో ప్రజల్లో కొంత భయాందోళన నెలకొన్నది. అయితే జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావం లేదని అధికార యంత్రాంగం చెప్పినప్పటికీ ప్రజల్లో ఆందోళన తగ్గటం లేదు. రెండు వారాలుగా చికెన్ కొనుగోళ్ళపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సాధారణంగా జిల్లా కేంద్రం గుంటూరు నగరంలో స్టాల్స్‌లో చికెన్ విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. ఇక ఆదివారం వచ్చిందంటే సాధారణ రోజుల కంటే రెట్టింపు విక్రయాలు జరుగుతాయి. ఒక్క ఆదివారం రోజునే చికెన్ స్టాల్స్‌లో రెండున్నర లక్షల కోళ్ళు అమ్ముడుపోతుంటాయని వ్యాపారులు తెలిపారు. అయితే బర్డ్ ఫ్లూ ప్రభావంతో విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. తాజాగా మొన్నటి ఆదివారం నగరంలో కేవలం సాదాసీదాగా 70వేల లోపు మాత్రమే కోళ్ళ విక్రయాలు జరిగాయని పౌల్ట్రీ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కొనుగోళ్ళు పడిపోవటంతో కొందరు చికెన్ స్టాల్స్ వ్యాపారులు ధరలు తగ్గించేందుకు నిర్ణయించారు.



గుంటూరు : కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న చికెన్ స్టాల్

చికెన్‌స్కిన్‌లెస్ కిలో రూ.100లకు విక్రయించాలని మూకుమ్మడిగా నిర్ణయించుకు న్నారు. దాంతో ఆయా స్టాల్స్‌లో ధరల బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇక మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం కిలో రూ. 160లకు విక్రయాలు జరుపుతున్నారు.

కోలుకోలేని దెబ్బే.....

బర్డ్ ఫ్లూ ప్రభావంతో చికెన్ స్టాల్స్ అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. దాంతో చికెన్ స్టాల్స్ కొనుగోళ్ళు వెలవెలబోతున్నాయి. రెండు వారాలుగా ఇదే పరిస్థితి నెలకొంటున్నదని, కనీసం స్టాల్స్ నిర్వహణ, కూలీల ఖర్చు కూడా వచ్చే పరిస్థితులు లేవని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఇది పౌల్ట్రీ వ్యాపారానికి కోలుకోలేని దెబ్బగా చెబుతున్నారు. మరి కొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నదని వ్యాపారులు అభిప్రాయ పడుతున్నారు.

పీఎంశ్రీ పథకంతో

తీరనున్న ల్యాబ్‌ల కొరత

201 పాఠశాలలకు రూ.31.31 కోట్లు మంజూరు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రధాన మంత్రి స్కూల్ రైజింగ్ ఇండియా పథకం ల్యాబ్‌ల కొరత తీరుస్తుంది. ఈ పథకం కింద రాష్ట్రంలో 201 పాఠశాలలకు రూ.31.31 కోట్లు మంజూరు చేశారు.



తుది మెరుగులు దిద్దుకుంటున్న కెమిస్ట్రీ ల్యాబ్

ఒక్కో ల్యాబ్ నిర్మాణానికి రూ.15.58 లక్షలు కేటాయించారు. తొలి విడతలో రూ.22.50 కోట్లు మంజూరు చేయగా ల్యాబ్‌ల నిర్మాణం తుది దశకు చేరుకుంది. చివరి దశ పనులకు మరో రూ.4.54 కోట్లు నిధులు మంజూరు చేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పర్యవేక్షణలో ప్రధానోపాధ్యాయుల పీపీఏ ఖాతాలకు నిధులు విడుదల చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో తుళ్లూరు, రేవేంద్రపాడు, కొల్లిపర, అంగలకుదురు, ప్రత్తిపాడు, బాపట్ల జిల్లాలో ఉల్లిపాలెం, నాగులపాలెం, యాజలి, అమృతలూరు, కొప్పెర ఉన్నత పాఠశాలల్లో ల్యాబ్‌లు నిర్మిస్తున్నారు. ల్యాబ్‌ల కొరత ఉండి స్థలంతో పాటు అధిక విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలను తొలి దశలో ఎంపిక చేసి ల్యాబ్‌లు మంజూరు చేశారు. ఈ పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా మార్చడంతో ఇంటర్ తరగతులు కూడా గత విద్యా సంవత్సరం నుంచి జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రయోగాలు ప్రత్యక్షంగా చేసే పరిజ్ఞానం చేకూరనుంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తిస్థాయిలో ఈ ల్యాబ్‌లో అందుబాటులోకి తెచ్చేందుకు సమగ్ర శిక్షా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

గురజాలలో.. వైసీపీకి షాక్

(5వ పేజీ తరువాయి)

మున్సిపల్ చైర్‌పర్సన్‌తో సహా టీడీపీ కండువా కప్పుకున్నారు. వైసీపీ హయాంలో ఎన్నికలు జరగనీయకుండా వైసీపీకి చెందిన వారే ఒక్కొక్కరు నామినేషన్ వేయడంతో 33 మంది సభ్యులు వైసీపీ కౌన్సిలర్లు కావడంతో పురపాలక సంఘం వైసీపీ ఖాతాలో జమ అయింది. మరో ఏడాదిలో ఎన్నికలు వుండగా ఇప్పుడు 17 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరడంతో వైసీపీకి షాక్ ఇచ్చినట్లు అయింది.

మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా భారతి ఏకగ్రీవ ఎన్నిక

పిడుగురాళ్ల పురపాలక సంఘం 30వ వార్డు కౌన్సిలర్‌గా వున్నం భారతి వైస్‌చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి వి మురళీకృష్ణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. వైసీపీకి చెందిన 17 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాగా 30వ వార్డు కౌన్సిలర్ వున్నం భారతి పేరును 28వ వార్డు కౌన్సిలర్ గర్రె నాగేశ్వరరావు ప్రతిపాదించగా 20వ వార్డు కౌన్సిలర్ కొత్త తులసి బలపరచగా మిగిలిన సభ్యులు ఆమోదం తెలిపారు. దీంతో వున్నం భారతిని వైస్‌చైర్మన్‌గా ధృవీకరిస్తూ ప్రత్యేక అధికారి మురళీకృష్ణ నియామకపత్రాన్ని భారతికి అందజేశారు. అనంతరం 17 మంది కౌన్సిలర్లు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో పార్టీలో చేరారు.

అభివృద్ధి యరపతినేనితోనే సాధ్యం : చైర్మన్ చినసుబ్బారావు

గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతోనే సాధ్యమవుతుందని తామంతా టీడీపీలో స్వచ్ఛందంగా చేరుతున్నామని చైర్‌పర్సన్ కొత్త చినసుబ్బారావు, మరికొందరు కౌన్సిలర్లు తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల పట్టణ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో అభివృద్ధే తారక మంత్రంగా తాను పనిచేస్తున్నానని, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికకు వైసీపీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా వున్నం భారతిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచకపాలనలో అనేక విధ్వంసాలకు పాల్పడ్డారే తప్ప అభివృద్ధి జోలికి వెళ్లలేదన్నారు. పురపాలక సంఘ భవనానికి తమ హయాంలోనే 2 కోట్ల రూపాయలు మంజూరు చేయించానన్నారు. రాబోయే ఐదేళ్లకు ఏమేమి అభివృద్ధి సాధించాలో ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నామన్నారు. టిడ్కో గృహాలు, రహదారుల విస్తరణ, మంచినీటి పథకానికి నిధులు మంజూరు చేయడం తెలుగుదేశం పార్టీ ఘనత అన్నారు.



వైస్ చైర్మన్ ఎన్నికకు హాజరైన కౌన్సిలర్లు

తిరుణాళ్ళను విజయవంతం చేద్దాం

- కోటప్పకొండలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి గొట్టిపాటి
- భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచన



కోటప్పకొండలో తిరుణాళ్ళ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ తిరుణాళ్ళ ఏర్పాట్లను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేద్దామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 26వ తేదీన రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు రానున్న సందర్భంగా తిరుణాళ్ళ ఏర్పాట్లను సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. కోటప్పకొండకు తరలివచ్చే భారీ విద్యుత్ ప్రభలు వచ్చే రహదారి, భక్తులు కొండకు చేరుకునే రహదారుల నిర్మాణం, మరమ్మతులు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కొండపై భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న తాటాకు చలువ పందిళ్ళు, క్యూలైన్లు, ఘాట్‌రోడ్డులో కాలింది విగ్రహం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తేలప్రోలు రమేష్, కడియం కోటి సుబ్బారావు, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అమరావతిలో శరవేగంగా ఇగ్నో వర్సిటీ నిర్మాణ పనులు

- నాక్‌లో ఏ ప్లస్ ప్లస్ హైయస్ట్ గ్రేడ్ కలిగిన విశ్వవిద్యాలయం
- జీ ప్లస్ 7తో పౌండేషన్ - ప్రస్తుతం జీ ప్లస్ 2తో నిర్మాణం



రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు రెవెన్యూలో నిర్మాణం జరుగుతున్న ఇగ్నో భవనం

తుళ్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) స్టడీ సెంటర్ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు ఎకరాల విస్తీర్ణంలో జీ ప్లస్ 7 అంతస్థుల నిర్మాణానికి వీలుగా పౌండేషన్ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం పనులు మొదటి శ్లాబ్ దశకు చేరుకున్నాయి. జీ ప్లస్ 2 అంతస్థులతో ఇప్పుడు నిర్మాణం చేస్తున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని మిగిలిన అంతస్థుల నిర్మాణం ఉంటుందని అధికారులు చెపుతున్నారు. తుళ్లూరు రెవెన్యూలో ఎన్ 13, 14 ప్రధాన రోడ్ల మధ్యలో దీని నిర్మాణం చేపట్టారు.

ఇగ్నో ప్రత్యేకతలు

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్శిటికి స్టడీ సెంటర్‌లున్నాయి. ఇందులో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని డిగ్రీ పట్టాలు సాధించిన వారికి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉంటుంది. ఇది గమనించే గత టీడీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిని ఎడ్యుకేషనల్ హబ్‌గా చేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించి స్థలాన్ని కేటాయించారు. ఇగ్నో సెంట్రల్ యూనివర్శిటీగా ఉంది. యూజీసీ అనుమతులున్న ఎడ్యుకేషన్ సంస్థ. ఇందులో చదివితే ఉద్యోగ ఉపాధి అవకాశాల తోపాటు, ఉన్నత చదువులకు ఎలిజిబులిటీ ఉంటుంది. అన్నీ రాష్ట్రాల్లో ఇగ్నోస్టడీ సెంటర్‌లున్నాయి. సుమారుగా 67 రీజినల్ సెంటర్‌లు, రెండు వేలు లెర్నింగ్, సపోర్టింగ్ సెంటర్‌లు దేశవ్యాప్తంగా ఇగ్నోకి ఉన్నాయి. నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడిడేషన్ కౌన్సిల్ (నాక్)లో హైయస్ట్ గ్రేడ్ (ఏ ప్లస్ ప్లస్)కలిగి ఉన్న ప్రథమ సార్వత్రిక విశ్వదాలయంగా ఇగ్నో ఉంది. అటువంటి విశ్వవిద్యాలయంలో చదువుకోవటానికి ఏపీ రాజధాని అమరావతిలో అవకాశం ఏర్పడబోతుంది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

● గంటల వ్యవధిలో నిందితుల గుర్తింపు

యడ్లపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన సంఘటన మండలంలోని తిమ్మాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన పావులూరి మల్లేశ్వరి గ్రామ పరిధిలోని కృష్ణగంగా నూలు పరిశ్రమ సమీపంలో బడ్డీకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తోంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు యువకులు బడ్డీకొట్టు వద్దకు వచ్చారు. వెనుక కూర్చున్న యువకుడు బైక్ దిగి కొట్టువద్దకు వచ్చి సిగరెట్లు, కూల్‌డ్రింక్ కావాలని అడుగుతూనే మల్లేశ్వరి మెడలోని రూ.2.65లక్షల విలువైన నాలుగు సవర్ల బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై పరారయ్యారు. దీనిపై మల్లేశ్వరి యడ్లపాడు పోలీసులకు సమాచారం అందించింది. స్పందించిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఆ ఇద్దరు యువకులను గంటల వ్యవధిలో అదుపులోకి తీసుకున్నారు. నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు ఆధ్వర్యంలో విచారణ జరిపిన పోలీసులు ఒకరు నాదెండ్ల, మరొకరు కొండకావూరు గ్రామానికి చెందిన యువకులుగా గుర్తించారు. యువకులు బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారని, జల్సాలకు అలవాటుపడి చోరీకి పాల్పడినట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

మహిళలు, బాలల హక్కుల పరిరక్షణకు కృషి: ఎంపీడీవో

శావల్యాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంలో మహిళలు, బాలికలకు కల్పించిన హక్కులకు భంగం వాటిల్లకుండా చూసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. స్త్రీల, శిశువుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన టోల్‌ఫ్రీ నెంబర్‌ల బోర్డును స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు సోమవారం ఆవిష్కరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఆపదలోనున్న శిశువుల రక్షణ కోసం 1098, మహిళల రక్షణ కోసం 181, పోలీసు సేవల కోసం 100 టోల్‌ఫ్రీ నెంబర్‌లకు ఫోన్ చేసి ప్రజలు తక్షణ సాయాన్ని పొందవచ్చన్నారు. ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత, సీసీ ఖాజా, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, అంగవాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

అగ్రహారం భూముల సర్వే చేపట్టాలి

ఈపూరు, ఫిబ్రవరి 17: (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళూరులోని అగ్రహారం భూములకు సర్వేచేసి పట్టాలు మంజూరు చేయాలని అగ్రహారం భూముల రైతులు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరెకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి జగ్గారావు, మండల నాయకులు నర్రా కిషోర్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత ఎంఏఎం ఇంజనీరింగ్ కళాశాల

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల జట్టు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఫెస్ట్‌లో మహిళా కబడ్డీ పోటీలలో విజేతగా నిలిచిందని ఎంఏఎం చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు సోమవారం తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, డాక్టర్ సాయి పవన్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు, పీడీ శంకర్ తదితరులు అభినందించారు.

క్లుప్తంగా...

● నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు పీజే మెటల్దాదేవి డిమాండ్ చేశారు. సోమవారం నరసరావుపేటలోని ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సీడీపీవో ఉమామహేశ్వరికి వినతిపత్రం అందజేశారు.

● చిలకలూరిపేట: గియాన్ బరే సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాప్తిపై వైద్య ఆరోగ్య శాఖాధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రజలకు తగిన సూచనలు, సలహాలు అందించాలని స్థానిక శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం అధికారులకు సూచించారు. సిండ్రోమ్ వ్యాప్తిపై సీఎం చంద్రబాబు ఇప్పటికే వైద్యశాఖతో పాటు అనుబంధ శాఖలను అప్రమత్తం చేశారన్నారు.

● కారుమంచి (శావల్యాపురం): మండలంలోని కారుమంచిలోని శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో ప్రథమ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో భక్తులు భజనలు నిర్వహించారు.

● శావల్యాపురం: ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేఎస్ లక్ష్మణరావుకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని, ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరుతూ వివిధ ప్రజాసంఘాల నాయకులు శావల్యాపురంలో సోమవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బొడ్డపాటి అప్పారావు, శ్రీనివాస్‌సింగ్, భువనగిరి వెంకటేశ్వర్లు, గణపర్తి వెంకటేశ్వర్లు, దుగ్గెంపూడి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: చిట్ ఫండ్ వ్యాపారం పేరుతో ప్రజల ఆస్తులు కొల్లగొడుతూ మోసం చేస్తున్న ధనలక్ష్మి చిట్‌ఫండ్ మేనేజర్ చల్లా శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నరసరావుపేట పట్టణం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ మేరకు ప్రజా సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి జీ రామకృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు కోటనాయక్, న్యాయవాది యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 90 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

● పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు 56,964

● 22 నాటికి కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లు పూర్తి

● కలెక్టర్ పి.అరుణ్‌బాబు



దేవస్థానం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి, 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 37,831మంది పురుష ఓటర్లు, 19,139మంది మహిళా ఓటర్లు కలిపి మొత్తం 56,964మంది పట్టభద్రులు ఓటు హక్కు పొందారని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆయన పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోసం జిల్లాలో 90 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ నిర్వహించేందుకు రిజర్వు సిబ్బందితో సహా 503 మందిని ఎంపిక చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 293మంది పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పోలింగ్ సిబ్బందికి ఈ రోజు తొలి శిక్షణ కార్యక్రమం నిర్వహించామని, ఈ నెల 22న మరోసారి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

తిరునాళ్ల ఏర్పాట్లు పూర్తిచేస్తాం

ఈ నెల 26న నిర్వహించనున్న కోటప్పకొండ తిరునాళ్ల కోసం ఏర్పాట్లను ఫిబ్రవరి 22 నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా నియమావళి ప్రకారం ఏర్పాట్లు జరుగుతాయన్నారు. శివరాత్రి మరుసటి రోజే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉన్నందున పట్టణంలో పోలింగ్ కార్యక్రమం పూర్తయ్యే వరకు తిరునాళ్ల ప్రభల తిరుగు ప్రయాణానికి ఆంక్షలు ఉంటాయని తెలిపారు.

పది విద్యార్థులకు 'స్ఫూర్తి'

పరీక్షలు రాయబోతున్న పది విద్యార్థులకు పరీక్షల భయం పోగొట్టేందుకు జిల్లాలో ఈ నెల 20 నుంచి స్ఫూర్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. నిపుణులతో ఆన్‌లైన్ విధానంలో అనవసర ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. స్ఫూర్తి కార్యక్రమానికి సంబంధించి గోడ పత్రికను ఆవిష్కరించారు.

బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలు

జిల్లాలోని అన్ని బాలికల సంక్షేమ వసతి గృహాలలో బాలికల భద్రత కోసం రక్ష పేరుతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా మరో 15 రోజులలో అన్ని బాలికల వసతి గృహాలలో సీసి కెమెరాలు ఏర్పాటు పూర్తవుతుందన్నారు. అదే విధంగా ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం జిల్లాలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి నెల మూడో శనివారం గ్రామ స్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రతి నెల ఒక గ్రామంలో తాను పర్యటించి పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తానన్నారు. సంక్షేమ హాస్టళ్లలో వారంలో ఒక రోజు కలెక్టర్ బస చేస్తారని తెలిపారు. ఉన్నతాధికారులు సైతం ఒక రోజు సంక్షేమ హాస్టళ్లలో రాత్రి బస చేయాల్సి ఉంటుందన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తగ్గించేందుకు పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డిఆర్వో మురళి, డిఐవో చంద్రకళ పాల్గొన్నారు.

తిరునాళ్లను విజయవంతం చేద్దాం

నరసరావుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి కోటప్పకొండ తిరునాళ్లను విజయవంతం చేయాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై సోమవారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ తిరునాళ్ల ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. దేవదాయశాఖ అధికారులు అన్ని శాఖల అధికారులను సమన్వయ పరుచుకొని పనిచేయాలని కలెక్టర్ సూచించారు. 21 నుంచి తిరునాళ్లలో బారికేడ్లు నిర్మిస్తామని, రహదారులు విస్తరణ, మరమ్మతులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ ఈఈ రాజా నాయక్ మాట్లాడుతూ పనులు వంటివి పూర్తి చేశామన్నారు. మరో మూడు రోజుల్లో అప్రోచ్ రోడ్డు నిర్మాణాలు, గ్రావెల్ ప్యాచ్ వర్కులు, జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ శాఖ అధికారులు తెలిపారు. తిరునాళ్లకు 550 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని కొండ దిగువ నుంచి 85బస్సులు పైకి నడుపుతున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి మాట్లాడుతూ కొండ దిగువ నుంచి పైవరకూ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, 108 వాహనాలు, క్యూలైన్ల వద్ద, మెట్ల మార్గంలో, కొండపైన మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు, నడవలేని వారి కోసం స్ట్రెక్చర్లు, వీల్ చైర్లు, సీపీఆర్ కిట్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. 5 లక్షల వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు 6 చోట్ల, 11 టీములను ఏర్పాటు చేస్తామని.. 130 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నామని గ్రామీణ నీటి సరఫరా అధికారులు చెప్పారు. నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. హై టెన్షన్ విద్యుత్ లైన్లను ప్రభలకు ఆటంకం లేకుండా చేశామని విద్యుత్ శాఖ ఎస్.ఈ విజయ్ కుమార్ తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా 8 పోక్లెయిన్‌లు ఏర్పాటు చేస్తున్నామని, తిరునాళ్ళకు ట్రాక్టర్‌పై వచ్చే భక్తులు పరిమిత సంఖ్యలో వచ్చేలా తనిఖీలు ఏర్పాటు చేశామన్నారు. కొండ పరిసర ప్రాంతాన్ని పది జోన్లుగా విభజించి 1300 మంది స్వీపర్లతో పారిశుధ్య పనులు చేపడతామని డీపీవో విజయభాస్కరరెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో తిరునాళ్ళ నిర్వహించేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశం అనంతరం కోటప్పకొండలో తిరునాళ్ల ఏర్పాట్లను కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీలించారు.

ఆలపాటి గెలుపునకు అందరూ కృషిచేయాలి

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



సమీక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, పరిశీలకులు మన్నవ మోహన్‌కృష్ణ తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎన్నికలలో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి అలపాటి రాజేంద్రప్రసాదు గెలుపునకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల సమీక్ష జరిగింది. 26న కోటప్పకొండ మహాశివరాత్రిని, 27న ఎమ్మెల్సీ ఎన్నికలను సమిష్టి కృషితో విజయవంత చేద్దామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మన్నవ మోహన్ కృష్ణ, డాక్టర్ సెల్, లీగల్ సెల్ సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● వినుకొండ: ఈ నెల 27వ తేదీన జరగనున్న కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ పల్నాడు జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ మేడం రమేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాయ్స్ హైస్కూల్‌లోని ఉపాధ్యాయులను కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఎండ్లూరి వీరయ్య, జడ్డా లక్ష్మీనారాయణ, నారిశెట్టి మహేష్, కాలువ నరేష్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షనర్ల మద్దతు కోరిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి ఆలపాటి గెలుపులో ప్రభుత్వ పెన్షనర్లు కీలక భాగస్వాములు కావాలని శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం కోరారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో జరిగిన విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో పుల్లారావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి, జనసేన ఇంచార్జి తోట రాజా రమేష్, బీజేపీ నాయకులు జయరామి రెడ్డి, టిడిపి నాయకులు షేక్ టీడీపీ కరీముల్లా, నెల్లూరి సదాశివరావు, మురకొండ మల్లిబాబు, తోట బ్రాహ్మస్వాములు, పెన్షనర్ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పెన్షనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

● చిలకలూరిపేట: ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మద్దతుగా సోమవారం పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పలువురు ఉద్యోగులను కలిసి, ఆలపాటికి ప్రథమ ప్రాధాన్య ఓటు వేయాలని టీడీపీ నాయకులు కోరారు. పార్టీ నాయకులు ఎస్.సదాశివరావు, బి.సుబ్బారావు, పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, కందుల రమణ, మురకొండ మల్లిబాబు, మక్కెన నరసింహారావు, అజహర్, తుబాటి శ్రీహరి, గుర్రం నాగ పూర్ణచంద్రరావు,మిరియాల రత్న కుమారి, అమరా రమాదేవి పాల్గొన్నారు. ప్రత్తిపాటి క్యాంపు కార్యాలయంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్ అధ్యక్షతన చిలకలూరిపేట మండల పరిధిలోని 30 ఓట్లకు ఒకరు చొప్పున నియమించిన కో ఆర్డినేటర్లు, ముఖ్య నాయకులు, గ్రామ పార్టీ నాయకులు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జి లతో ఎమ్మెల్సీ ఎన్నికల పార్టీ పరిశీలకులు పి.దినేష్ రెడ్డి సమావేశం నిర్వహించారు. అనంతరం పసుమర్రు గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎస్.సదాశివరావు, షేక్ కరీముల్లా, ఎస్.ఆంజనేయులు, ఎ.సోంబాబు, జి.వెంకటేశ్వర్లు, టి.శ్రీహరి, ఎం.మల్లిబాబు, అబ్దుల్ మజీద్. అజారుద్దీన్, జానీభాష, జె.సుబ్బారావు, చౌదరి, దశరధ రామయ్య, బి.శరత్, సయ్యద్ రఫీ, నాగుర్, వీరారెడ్డి, కోడె హనుమంతరావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్

వినుకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీలో ఉన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రపార్టీ పిలుపుమేరకు మున్సిపాలిటీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సుభాష్‌చంద్రబోస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 17వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్ణయించడం జరిగిందని తెలిపారు. అన్ని రంగాల్లోని కార్మికులు పాల్గొని పోరాటాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, మల్లికార్జునరావు, యూనియన్ నాయకులు శ్రీనివాస్, అబ్రహాం రాజు, సాయిబాబు, పచ్చిగోర్ల ఏసు తదితరులు పాల్గొన్నారు.

గొరిజవోలులో హీరో శివాజీ సినిమా షూటింగ్



సినీ హీరో శివాజీని సత్కరిస్తున్న పుల్లారావు

నాదెండ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో శివాజీ కథానాయకుడిగా నిర్మిస్తున్న సినిమా షూటింగ్ ఆయన స్వగ్రామమైన నాదెండ్ల మండలంలోని గొరిజవోలు గ్రామంలో సోమవారం జరిగింది. శ్రీ శివాజీ పొడక్షన్-2 బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి శివాజీ నిర్మాతగా ఉన్నారు. ఆయన సరసన లయ కథానాయకగా నటిస్తున్నది. గ్రామ కార్యదర్శి పాత్రలో ఆయన నటిస్తుండగా గ్రామ సచివాలయంలో షూటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు శివాజీని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనను గొప్ప వాడిని చేసిన చిత్ర పరిశ్రమ అభివృద్ధితో పాటు ఆసక్తి ఉన్న యువతను సినీ రంగంలో ప్రోత్సహించటం శివాజీ గొప్పదనమన్నారు. కాగా మంగళ, బుధవారాల్లో కొండవీడు ఘాట్‌లో షూటింగ్ జరుగుతుందని నిర్మాత శివాజీ, దర్శకుడు సుధీర్‌లు పేర్కొన్నారు. పుల్లారావు వెంట పార్టీ నాయకులు షేక్ కరిముల్లా, వీరారెడ్డి, హిమవంతరావు, సత్యనారాయణ, గుర్రం స్వాములు, రమేష్ పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన నైపుణ్య శిక్షణ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు వారాల ఉచిత ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ప్రోగ్రాంను ఇన్ఫోసిస్ ఫౌండేషన్, హైదరాబాదు టీఎంఐ-2 ఆధ్వర్యంలో నిర్వహించారని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ షేక్ ముజీర్ మాట్లాడుతూ విద్యార్థులకు శిక్షణ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు టీఎంఐ సీనియర్ మేనేజర్ షేక్ ఇమ్రాన్, పల్నాడు జిల్లా మినిస్ట్రీ ఆఫ్ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ అధికారులు శ్రీనివాస్, మల్లేశ్వరి శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు.



ఈపూరులో మిరప తోటను పరిశీలిస్తున్న అమల కుమారి

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

● జిల్లా మేనేజర్ అమల కుమారి

ఈపూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగుచేయడం వలన నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి అన్నారు. ఈపూరు గ్రామానికి చెందిన నాశన పద్మావతి మిర్చి వ్యవసాయ క్షేత్రంలో పంట కోత ప్రయోగం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగుచేసే మిరపలో అంతర పంట గా ఉల్లి, ముల్లంగి, కొత్తిమీర, బంతి, వేయడం ద్వారా మిరప పంటలు వేసే రైతులకు అపార నష్టం కలుగజేసే నల్ల తామర పురుగు ఉధృతి తగ్గుతుందని, అంతర పంటల నుంచి వచ్చే ఘాటైన వాసనకు నల్ల తామర పురుగు మిరప పంటను ఆశించదన్నారు. అంతేకాకుండా క్షేత్రం చుట్టూ రక్షణ పంటగా మొక్క జొన్న వేయడం ద్వారా మిత్ర పురుగుల ఉధృతి పెరిగి పంటను ఆశించే పేను బంక, ఎర్ర నల్లి, తెల్ల దోమ, పచ్చ దోమ, ఉధృతి తక్కువగా ఉందన్నారు. పద్మావతి వ్యసాయ క్షేత్రం పంట కోత ప్రయోగం నిర్వహించగా 22.1కేజీలు (పండు కాయలు) మొదటి కోత సుమారుగా ఎకరాకు 12 క్వింటాలు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కార్యక్రమంలో జిల్లా సిబ్బంది సైదయ్య, నందకుమార్, భాస్కర్‌రావు, యూనిట్ ఇంచార్జి ఆంజనేయులు, లక్ష్మానాయక్, చిన్న నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం: తహసీల్దార్ నళిని

ఈపూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన ఉత్పత్తులను వినియోగించుకోవడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చునని తహసీల్దార్ ఏ నళిని అన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. విక్రయ కేంద్రాన్ని తహసీల్దార్ ఏ నళిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, ఏవో రామారావు, సైదయ్య, ఆంజనేయులు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించినపుడే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని మండల తహసీల్దార్ సుజాత అన్నారు. ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అవగాహన కేంద్రాన్ని తహసీల్దార్ సుజాత సోమవారం ప్రారంభించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.



లే అవుట్ ఖాళీ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు

కాలనీ ఉమ్మడి ఖాళీ స్థలం ఆక్రమణ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరి వారిపాలెం ఎస్టీ కాలనీలో సామాజిక అవసరాల కోసం కొంత స్థలం కేయించి పంపిణీ చేశారు. ఆ సమయంలో లే అవుట్ ఓపెన్ ప్లేస్ అంటూ కమ్యూనిటీ హాల్, ఇతర అవసరాలకోసం 33 సెంట్లు స్థలం వదిలారు. అయితే కాలనీలో అప్పట్లో చివర స్థలాలు వచ్చిన వారు తమకు ఇచ్చిన స్థలాలు లే అవుట్ ఓపెన్ ప్లేస్ కింద వదలి అప్పుడు ఓపెన్ ప్లేస్ కింద ఇచ్చిన స్థలంలో గృహాలు నిర్మించుకున్నారు. అయితే ఇప్పుడు ఆ స్థలం కలెక్టర్ కార్యాలయంకు అతి సమీపంగా ఉండటం, స్థలాలు రేట్లు పెరగడంతో అధికార పార్టీ నాయకులు, అధికారుల సాయంతో కబ్జాదారులు అక్కడ శాశ్వత గృహాలు నిర్మించుకుంటున్నారు. అధికారులు తెలిసినా మిన్నకున్నట్లు కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు విచారించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.



సమీక్షలో పాల్గొన్న న్యాయాధికారులు, పోలీసు అధికారులు

న్యాయాధికారుల సమీక్ష

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మార్చి 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి సోమవారం స్థానిక న్యాయస్థాన భవనాల ఆవరణలో పోలీసు అధికారులతో న్యాయాధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మార్చి 8న స్థానిక న్యాయస్థానం భవనాలు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు స్థానిక అదనపు సీనియర్ సివిల్ న్యాయ అధికారి కే మధుస్వామి తెలిపారు. ఈ సందర్భంగా అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారులు పోలీసు అధికారులకు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి చట్టపరమైన అంశాలను వివరించారు. పోలీసు అధికారులు కేసుల పరిష్కారానికి సంబంధించి లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో న్యాయధికారులు కే.మధుస్వామి, ఆర్.ఆశీర్వాదం పాల్, మొదటి పట్టణ ఎస్ఐ అరుణ, రెండో పట్టణ ఎస్ఐ లేఖ ప్రియాంక, రొంపిచర్ల ఎస్ఐ మణికృష్ణ, నకరికల్లు ఎస్ఐ సీహెచ్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శివ జయంతి



శివజయంతి మహోత్సవంలో కేక్‌ను కట్ చేస్తున్న చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో పరిపూర్ణత సాధించడానికి మేలైన మార్గమే ధ్యానమని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ ఇసుకవాగు బజారులోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం శివ జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు కేక్‌ను కట్‌చేసి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జీవీ ఆంజేయులు, బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. త్వరలో కొండపై రామలింగేశ్వరస్వామి గుడి నిర్మాణం పూర్తిచేసి అక్కడ బ్రహ్మకుమారీలతో కార్యక్రమం ఏర్పాటు చేయాలనుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో పాటు శివభక్తులు, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

అడవి జంతువులను కాపాడుకోవాలి

● పల్నాడు జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణప్రియ

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 17, (ఆంధ్రజ్యోతి) ప్రకృతి సంపద అయిన అడవులను అడవి జంతులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పల్నాడు జిల్లా అటవీ శాఖ అధికారి జి.కృష్ణప్రియ (ఐఎఫ్ఎస్) తెలిపారు. మండలంలోని వెంకుపాలెం సమీపంలోని నగరవనంలో అటవీ అధికారి కృష్ణప్రియ ఆధ్వర్యంలో టైగర్ రెస్క్యూ ఆపరేషన్స్‌పై సోమవారం వర్కు షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ జుబేర్ ఆలీ, డాక్టర్ వెస్లీ పాల్గొని అడవి జంతులు, వాటి జీవన విధానం, ఆర్యోగం, ఫారెస్టు ప్రాంతంలో వాటి కదలికలు, గ్రామాల్లోకి అడవి జంతువులు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజి అధికారులు మాధవరావు, విజయలక్ష్మి, విజయకుమారి, రవణితో పాటు డీఆర్‌వోలు, ఎఫ్‌డీవోలు సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి బంధువుల ఆందోళన

● చర్చించి ఆందోళన విరమింపచేసిన బొల్లాపల్లి ఎస్ఐ

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పల్లపు చిన్న (28) కుటుంబానికి న్యాయం చేయాలంటూ మృతుడి బంధువులు వినుకొండ ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో బొల్లాపల్లి ఎస్ఐ బాలకృష్ణ ప్రమాదానికి కారణమైన ఆటోను గుర్తించామని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపి వారికి నచ్చచెప్పటంతో బంధువులు ఆందోళన విరమించారు. తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ గణేష్‌నగర్‌కు చెందిన పల్లపు చిన్నతో పాటు మరికొంతమంది బొల్లాపల్లి మండలం గండిగనుమలకు మిర్చి కోతకు వచ్చారు. చిన్నతో కలిసి జీవిస్తున్న జంగాల స్వాతి చిన్న వద్ద కూలీ పనులు చేస్తోంది. వారిని కలిసేందుకు స్వాతి బంధువులు ద్విచక్రవాహనంపై వచ్చి చిన్నను కలిశారు. చిన్నతో పాటు స్వాతి, స్వాతి అక్క హుస్సేనమ్మ, అన్న రాజమౌళీలు ద్విచక్రవాహనంపై సోలాయపాలెంకు బయలుదేరగా వాహనంలో పెట్రోల్ అయిపోయి చిన్న మినహా మిగిలిన ముగ్గురు బస్సులో సోలాయపాలెంకు చేరుకున్నారు. ఇదే సమయంలో రేమిడిచర్లకు చెందిన ఆటో చిన్నను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని వినుకొండకు తరలించారు. సంఘటన ప్రాంతంలో పడి ఉన్న ఆటో నంబరు ప్లేట్‌ను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆటో డ్రైవర్‌తో పాటు వాహన యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతునికి భార్య భద్రమ్మ, ఐదుగురు సంతానం. సహజీవనం సాగిస్తున్న స్వాతికి ఒక కుమారుడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు బంధువులకు అప్పగించారు.